## కోరుట్లలో విషాదం.. విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు

**జగిత్యాల:** కోరుట్లలో విషాదం చోటు చేసుకుంది. వినాయక విగ్రహాలు తరలిస్తుండగా ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనలో మృతులు బంటిసాయి,వినోద్‌లుగా గుర్తించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలాజీ కళా ఆర్ట్స్ విగ్రహాల తయారి యజమాని అల్వాల వినోద్, బంటి సాయి అనే ఇద్దరు యువకులు కోరుట్ల పట్టణం శివారులోని వినాయక విగ్రహాల తయారు చేస్తున్నారు.



ప్రభాత
# సూర్య
www.suryaa.news
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 16 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 40



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఎన్నికల హడావుడి

**వచ్చే నెల రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు**

- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- ఈ నెలాఖరులో జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్
- తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచన
- త్వరలో జరిగే మంత్రివర్గ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం
- ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు
- వీలున్నంత త్వరగా సన్న ధాన్యానికి బోనస్
- తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధం!

సూర్య హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నగారా త్వరలో మోగనుంది. వచ్చే నెల రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల చివరి వారంలోనే వస్తుందని సమాచారం. కాగా స్థానిక ఎన్నికల నిర్వహణ అంశంపై త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని స్థానిక సంస్థల గడువు ఎప్పుడో ముగిసింది. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024, జనవరిలోనే అయిపోయింది. జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాల - మిగతా2లో



## దక్షిణార్ధ దేశాల గొంతుకకు జీ7 వేదిక

- భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నాం
- ప్రధాని మోదీ వ్యాఖ్య
- 3 దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరిక

# స్కిల్ యూనివర్సిటీల్లో సీవోఈలు

- వాటికి ఐటీఐలను అనుసంధానం చేస్తాం
- కేంద్రమంత్రి జయంత్‌చౌదరితో సీఎం రేవంత్‌రెడ్డి
- ఐటీఐల్లో సోలార్ విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుకు ఆదేశాలు



సూర్య హైదరాబాద్

రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్ ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ ఇద్దరూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్రమంత్రి అభినందించారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో - మిగతా2లో

# బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

- రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ మీకు తోడుగా నిలుస్తుంది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ




సూర్య హైదరాబాద్

గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్) సమర్పించడం తెలంగాణ నీటి హక్కులను - మిగతా2లో



## కుప్పకూలిన హెలికాప్టర్


- రెండేళ్ల పాప సహా ఏడుగురు దుర్మరణం
- కేదార్‌నాథ్ నుంచి తిరిగి వస్తుండగా దుర్ఘటన
- ఆర్యన్ ఏవియేషన్ కార్యకలాపాలపై నిషేధం
- సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన సర్కార్



## విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

- విమాన ప్రమాదంలో మరణించినవారిలోఒకరైన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ
- భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాక సోమవారం ఆయన స్వస్థలం రాజ్‌కోట్‌లో అంత్యక్రియలు

# వెనక్కి తగ్గని ఇజ్రాయెల్, ఇరాన్



- ఇరాన్‌లోని గ్యాస్, చమురు కర్మాగారాలపై బాంబులు
- రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు
- 406 మంది మృతి.. ఒక్క భవనంలోనే 60 మంది!
- ఇజ్రాయెల్ నగరాలపై ఇరాన్ భారీ దాడులు.. అపార్ట్‌మెంట్ ధ్వంసమై ఏడుగురి దుర్మరణం
- క్షతగాత్రులు 390 మందికి పైగానే.. అమెరికాతో ఇరాన్ ఆరో విడత అణు చర్చలు రద్దు
- మాపై దాడి చేస్తే ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం: ట్రంప్
- కొడుకు పెళ్లి వాయిదా వేసుకున్న నెతన్యాహూ

# విద్యార్థుల భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు



- విద్యారంగానికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం: డిప్యూటీ సీఎం
- విక్టోరియా మెమోరియల్ హోంలో అనాథ విద్యార్థుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్న భట్టి

సూర్య హైదరాబాద్

విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే మెరుగుపడ్డ తెలంగాణ నేడు ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. - మిగతా2లో



## హడలెత్తించిన ఎయిరిండియా విమానం

- సాంకేతిక లోపంతో రన్‌వేపై ఆగింది!
- 18 గంటల తర్వాత టేకాఫ్
- ప్రయాణికులు రెండుసార్లు విమానం దిగాల్సి వచ్చింది.

# ఎన్నికల హడావుడి

-మొదటిపేజీ తరువాయి

గడువు గత ఏడాది జూన్‌లో పూర్తయింది. ఇక పురపాలక సంఘాలకు ఈ ఏడాది జనవరిలో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో వీలున్నంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వస్తోంది. మరోవైపు కేంద్రం ప్రతి ఏటా స్థానిక సంస్థలకు రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే పాలకవర్గాలు లేని కారణంగా ఈ నిధులను రాష్ట్రం కోల్పోవాల్సి వస్తోంది. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేకపోతోందని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో స్థానిక సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించే ముందే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. దీంతో పాటు సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చే ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేయనుంది.

ఈ రెండు పథకాల నిధులను జమ చేసిన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు 15 రోజులు మాత్రమే సమయం ఉందని ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఈ సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నాయి. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ నోటిఫికేషన్ ఇస్తారని, ఈ ఎన్నికల అనంతరం వారం రోజుల వ్యవధిలోనే సర్పంచ్‌లు, మున్సిపాలిటీలకు కూడా ఎన్నికల నగారా మోగించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

**అధికార పార్టీలో 'కమిటీల' హడావుడి**

స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరుగుతాయనే సమాచారం నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హడావుడి పెరిగింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేయనున్న గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకానికి గడువు విధించారు. డీసీసీ అధ్యక్షులు, పార్టీ పరిశీలకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు.

ఈ నెల 25వ తేదీకల్లా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలని, గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలకు నియామక ఉత్తర్వులను కూడా ఇచ్చేయాలని ఆమె ఈ సమావేశంలో ఆదేశించారు. దీంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదుగురు ముఖ్య నాయకుల పేర్లను పీసీసీకి పంపాలని, వీరికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తామని చెప్పినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో కేడర్ ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలనే వ్యూహంతోనే మీనాక్షి ఈ ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

**రిజర్వేషన్ల పెంపు లేకుండానే..!**

ఈ నెల చివరి వారంలో స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే పక్షంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అవకాశం లేనట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పార్లమెంటుతో పాటు రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంది. అయితే ఇది ఇప్పట్లో జరిగే అవకాశం లేదు. అందువల్ల బీసీలకు పాత రిజర్వేషన్లనే కొనసాగించవలసి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం సీట్లు కేటాయిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో..కేంద్రం అనుమతితో నిమిత్తం లేకుండా పార్టీ పరంగా బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

**నేడు మంత్రులతో సీఎం కీలక చర్చలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం కానున్నారు. పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రధానంగా స్థానిక ఎన్నికల నిర్వహణ, రైతు భరోసా నిధుల పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాస్తవానికి ప్రతి 15 రోజులకు ఒకసారి కేబినెట్ భేటీ నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే సోమవారం మాత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది.

## బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు..

# గాంధీ భవన్‌లో రెడీ అవుతున్నాయి

బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు గాంధీభవన్‌లోనే రెడీ అవుతున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయని.. వాట్సాప్‌లో స్టేటస్ పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న కేసులన్నీ తప్పుడు కేసులే అని ఒక మాజీ పోలీసు అధికారిగా చెబుతున్నానని స్పష్టం చేశారు. . కొణతం దిలీప్‌పై ఆదిలాబాద్ జిల్లాలో అక్మ కేసులు పెట్టారని.. ఆయన్ను నిర్మల్ పోలీసులు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ కోర్టు మెజిస్ట్రేట్ దిలీప్‌కు బెయిల్ ఇస్తే వెంటనే కడెం పోలీసులు వచ్చారని పేర్కొన్నారు. ఇదెక్కడి ఆటవిక న్యాయమని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు అవుతున్నాయని మండిపడ్డారు. వాట్సాప్‌లో స్టేటస్‌లు పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి ఫోర్ బ్రదర్స్ సిటీ అంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.200 కోట్లతో అందాల పోటీలు పెట్టి తెలంగాణకు తలవంపులు తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇంగ్లండ్‌కు చెందిన మ్యాగీ మిల్లా అనే మిస్ వరల్డ్ కంటెస్టెంట్ తనకు అవమానం జరిగిందని పోటీ నుంచి తప్పుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు అసభ్యంగా ప్రవర్తించడంతో మ్యాగీ మిల్లా అందాల పోటీ నుంచి తప్పుకున్నారని పేర్కొన్నారు. స్ ఇంగ్లండ్ మాగీ మిల్లాకు తెలంగాణ ప్రజల తరపున కేటీఆర్ క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. కేటీఆర్ అమెరికా వెళ్లి తెలంగాణ గురించి మాట్లాతున్నందుకు, చెన్నై వెళ్లి దక్షిణ భారత దేశానికి



జరుగుతున్న అన్యాయంపై మాట్లాడుతున్నందుకు కేసులు పెడుతున్నారా అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్ పై అసెంబ్లీలో చర్చ ఎందుకు పెట్టలేదని రేవంత్ రెడ్డిని నిలదీశారు. కేటీఆర్ లై డిటెక్టర్ టెస్ట్ కు సిద్ధమని అంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో అసలు నిందితుడు రేవంత్ రెడ్డి అని కేసు పెట్టాను %ా%.కానీ నాకు తెలియకుండానే పోలీసులు కేసును క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సీఎం కాబట్టి కేసు పెట్టలేదని పోలీసులు అంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఒక న్యాయం, ఇంకొకరికి ఇంకో న్యాయం చట్టంలో ఉందా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరుల దౌర్జన్యంతో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని.. అతనిపై చర్యలేవని నిలదీశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే లై డిక్టేటర్ టెస్ట్ కు, బహిరంగ విచారణకు రావాలని సవాలు విసిరారు. కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులను వెంటనే విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై పెట్టిన కేసులపై న్యాయస్థానాలను తప్పకుండా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీలోకి స్వప్న?

**కొద్ది రోజులుగా కాంగ్రెస్‌కు దూరందూరం**

**పార్టీలో ప్రాధాన్యత లేదని సన్నిహితుల వద్ద ఆవేదన**

**కాషాయ కండువా కప్పుకొనేందుకు ఏర్పాట్లు**

**తాండూరు:** మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ కాంగ్రెస్‌ను వీడి కాషాయదళంలో చేరనున్నారా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అధికార పార్టీలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని అసంతృప్తిగా ఉన్న ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది తాండూరులో హాట్‌టాపిక్‌గా మారింది. పలువురు మాజీ కౌన్సిలర్లు సైతం స్వప్న బాటలో నడవనున్నట్లు సమాచారం.

మహేందర్‌రెడ్డి వర్గం నుంచి..

2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పట్నం మహేందర్‌రెడ్డి వర్గం నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిగా స్వప్న రేసులోకి వచ్చారు. మరో వైపు ఇదే పార్టీ నుంచి రోహిత్‌రెడ్డి వర్గం తరఫున పట్లోళ్ల దీపనర్సింహులు చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేశారు. 36 వార్డులున్న తాండూరులో మహేందర్‌రెడ్డి వర్గీయులు ఎక్కువమంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. దీంతో చైర్‌పర్సన్ కుర్చీ కోసం పోటీ నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు నాయకులు కల్పించుకుని, చైర్‌పర్సన్ పదవీకాలాన్ని ఇద్దరూ చెరి సగం పంచుకోవాలని సూచించారు. మొదటిసారి స్వప్నకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో దీపకు వైస్ చైర్‌పర్సన్ కుర్చీ ఇచ్చి బుజ్జగించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, కోర్టు కేసుల నేపథ్యంలో పదవీ కాలమంతా స్వప్ననే కొనసాగారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి గొడవలే జరిగాయి.



**రాష్ట్ర కమిటీ ఎన్నిక తర్వాతే..**

గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత స్వప్న కాంగ్రెస్‌లో చేరారు. అయితే పదవీ కాలం ముగిసిన తర్వాత ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఆమెకు ఆహ్వానం ఆగిపోయింది. ఈ విషయమై తన సన్నిహితుల వద్ద పలుమార్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈక్రమంలోనే బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కమిటీ నియామకం తర్వాతే కాషాయ తీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది.

## విద్యార్థుల భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు

-మొదటిపేజీ తరువాయి

అందుకే విద్యారంగానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో అనాథ విద్యార్థుల నడుమ భట్టి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచంతో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని.. మొదటి విడతలో రూ.11,600 కోట్లతో 100 పాఠశాలలను నెలకొల్పుతామని చెప్పారు. ఎంతో విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడతామన్నారు. విక్టోరియా మెమోరియల్ స్కూల్ అభివృద్ధి, స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు రూ.5 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని.. ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

**గాంధీభవన్‌లో రక్తదాన శిబిరం..**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెసను అధికారంలోకి తేవడంలో భట్టి కీలకపాత్ర పోషించారన్నారు. భట్టిపై అభిమానంతో వందలాది మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు.

## స్కిల్ యూనివర్సిటీల్లో సీవోఈలు

-మొదటిపేజీ తరువాయి

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానికి ఐటీఐలను అనుసంధానిస్తామని తెలిపారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద ఈ యూనివర్సిటీకి మద్దతివ్వాలని కేంద్ర మంత్రిని కోరగా.. తమ సహకారం తప్పక ఉంటుందని జయంత్ చౌదరి చెప్పారు. ఐటీఐలన్నింటికీ ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని సీఎంకు సూచించగా.. ఐటీఐల్లో సోలార్ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను రేవంత్ ఆదేశించారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీని నియమించాలని అన్నారు.

## నేడు రైతులతో సీఎం ముఖాముఖి




హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏడాదిన్నరలోనే రైతు సంక్షేమానికి రూ.78,000 కోట్లు ఖర్చు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి, విశ్వవిద్యాలయ ఉప కులపతి అల్దాస్ జానయ్యలకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో సీఎం స్వయంగా పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని, కీలక నిర్ణయాలు వెల్లడిస్తారని చెప్పారు. గత ఏడాది మార్చి నుంచి నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమాల్లో ఇంతవరకు 6.35 లక్షల మంది పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం 566 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉండగా.. సోమవారం మరో 1,034 వేదికల్లో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సీఎం ముఖాముఖికి 1,500 మంది రైతులు హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని 1,600 రైతు వేదికల్లో ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

-మొదటిపేజీ తరువాయి



కాలరాయడమే అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్... ప్రభుత్వానికి తోడుగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ మేరకు గోదావరి బనకచర్ల అంశంపై మంత్రి ఉత్తమ్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపే, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, ఏపీ యూనిలేటరల్‌గా ముందుకెళ్తుండటం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్ర జలశక్తి మంత్రికి ఈ ఏడాది జూన్ 13న మంత్రి ఉత్తమ్ లేఖ రాయడాన్ని హరీశ్‌రావు అభినందించారు. 'ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమే. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాలి. గోదావరి జలాల్లో 969 టీఎంసీల తెలంగాణ వాటాలో ఇప్పటివరకు వినియోగం 600 టీఎంసీలకు పెరిగింది. గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బరాజ్‌లు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృద్ధి, చెరువులు, చెక్ డ్యామ్‌లు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలోకి తెచ్చాం. కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా (బీఆర్ అంబేద్కర్ ప్రాజెక్టు) డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వానాకాలపు వరద జలాలే తరలిస్తామన్నా, గోదావరి ట్రిబ్యునల్ అవార్డులో 'ఆల్ వాటర్స్'అనే పదమే ఉన్నదని నిపుణుల అభిప్రాయం. అదనపు జలాలు అనే అంశం గోదావరి అవార్డులో లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణకు ఈ 157.5 టీఎంసీల అదనపు వాటాను కోరాలి. న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలి. కేసీఆర్ పోరాట ఫలితంగా ఇప్పుడు 45 టీఎంసీలతో పాటు 112.5 టీఎంసీల అదనపు వాటా కోసం ట్రిబ్యునల్ ముందు వాదించే అవకాశం వచ్చింది'అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# వెనక్కి తగ్గని ఇజ్రాయెల్, ఇరాన్

దుబాయ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ/జెరూసలేం

ఇజ్రాయెల్, ఇరాన్ ఆదివారం వరసగా మూడో రోజూ పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. ఇరాన్ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు గ్యాస్, చమురు శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ భారీగా దాడులు చేసింది. క్షిపణి దాడులతో టెహ్రాన్ దద్దరిల్లిపోయింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లో భారీ విధ్వంసం సృష్టిస్తున్నాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలు తదితరాల జోలికి రావొద్దని ఇరాన్‌ను ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. వాటిపై దాడులు చేస్తే కనీవినీ ఎరగని రీతిలో సైనిక శక్తిని ప్రయోగించి ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. తక్షణం దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటేనే దాడులు తగ్గుముఖం పడతాయని పునరుద్ఘాటించారు.

**ఊపిరి సలపనివ్వని ఇజ్రాయెల్**

ఇరాన్‌కు ఏమాత్రం సమయమివ్వకుండా టెహ్రాన్, సమీప ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. టెహ్రాన్‌లో పౌర భవన సముదాయంపై దాడిలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 29 మంది చిన్నారులే! ఇప్పటిదాకా 406 మంది మరణించగా 700 మందికి పైగా గాయపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద 'ది సౌత్ పార్స్' సహజవాయువు ప్రాసెసింగ్ ప్లాంట్ దాడిలో దారుణంగా దెబ్బతింది.

పర్షియన్ గల్ఫ్‌లో బుషెహర్ ప్రావిన్సులోని చమురుశుద్ధి కర్మాగారమూ మంటల్లో చిక్కుకుంది. షహ్రాన్ ఆయిల్ డిపోపైనా దాడులు జరిగాయి. "ఆయుధాల ఉత్పత్తి కేంద్రాల నుంచి సిబ్బంది పారిపోండి. వాటిపై దాడులు చేయబోతున్నాం. అణు విద్యుత్కేంద్రాల సమీప ప్రాంతాల పౌరులూ పారిపోండి" అని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. ఇస్ఫహాన్ అణువిద్యుత్ కేంద్రంపై మరోసారి దాడులు చేసినట్టు ప్రకటించింది.

**క్షిపణులతో హోరెత్తించిన ఇరాన్**

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. యుద్ధవిమానాల ఇంధన తయారీ కేంద్రాలపై మిసైళ్లు ప్రయోగించింది. హైఫా సిటీలో చమురుశుద్ధి కర్మాగారంపై దాడులు చేయడంతో పైప్, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. దాడుల్లో ఇప్పటిదాకా 14 మంది చనిపోయినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. 390 మందికి పైగా గాయపడ్డట్టు పేర్కొంది. టెల్‌అవీవ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వరుసగా మూడోరోజు మూసేశారు. టెల్‌అవీవ్ వీధుల్లో కుప్పకూలిన భవనాలు, కాలిపోయిన కార్లు, బద్దలైన కిటికీలు, తలుపులూ దర్శనమిస్తున్నాయని అసోసియేటెట్ ప్రెస్ రిపోర్టర్ తెలిపారు. టెల్ అవీవ్‌కు దక్షిణాన బాట్‌యామ్ ప్రాంతంలోని 8 అంతస్తుల అపార్ట్‌మెంట్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైంది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా 35 మంది జాడ గల్లంతైంది. పలువురిని రెస్క్యూ బృందాలు శిథిలాల నుంచి కాపాడాయి. ఘటనాస్థలిని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సందర్శించారు. ఇరాన్ కావాలనే జనావాసాలపైనే దాడులు చేస్తోందని మండిపడ్డారు.

దీనికి భారీమూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. యుద్ధం నేపథ్యంలో కుమారుడు అవ్‌నర్ వివాహ వేడుకను వాయిదా వేసుకుంటున్నట్టు నెతన్యాహూ వెల్లడించారు. అటు హమాస్, ఇటు ఇరాన్ దాడులతో దేశమంతా యుద్ధంలో మునిగి తేలుతుంతే ఇంట్లో పెళ్లి సంబరాలు చేసుకుంటారా అంటూ విమర్శలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఖమేనీ హత్యకు ప్లాన్!**

**వారించిన ట్రంప్**

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ ప్లాన్ చేసినట్టు సమాచారం! అమెరికా ఈ మేరకు వెల్లడించింది. "అందుకు సర్వం సిద్ధమైంది. వద్దంటూ అధ్యక్షుడు ట్రంప్ వారించడంతో వెనక్కు తగ్గింది"అని లేదంటే ఖమేనీని చంపడం పెద్ద పని కాదని ఇజ్రాయెల్ వర్గాలు అన్నాయి.

**వెంటనే ఆపగలను: ట్రంప్**

ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణను ఇప్పటికిప్పుడు ఆపేయగలనని ట్రంప్ చెప్పుకున్నారు. "ఆ దేశాలను నిలువరించి ఈ రక్తపాతాన్ని ఆపడం నాకు చాలా తేలిక. ఈ రగడతో అమెరికాకు సంబంధం లేదు. ఇజ్రాయెల్‌కు మేం ఎలాంటి సాయమూ చేయడం లేదు" అని చెప్పారు. ఇరాన్, ఇజ్రాయెల్ సంయమనం పాటించాలని ప్రపంచ దేశాలు కోరాయి.

**మీరు ఆపితే మేమూ ఆపుతాం**

దాడులవేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్ దాడులను ఆపితే తామూ దాడులను నిలిపేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. "మాకు యుద్ధ విస్తరణ కాంక్ష లేదు. కానీ ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని పశ్చిమాసియాలో మరింత విస్తరించాలని తహతహలాడుతోంది. అందుకే బుషెహర్ ప్రావిన్సులో ఖతార్‌తో కలిసి ఇరాన్ నిర్వహిస్తున్న అసాలుయే ఆయిల్ రిఫైనరీపై దాడి చేసింది" అంటూ మండిపడ్డారు.

తమ ఆర్థికమూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని దుయ్య బట్టారు. ఒమన్ మధ్యవర్తిత్వంలో అమెరికా, ఇరాన్ మధ్య ఆదివారం జరగాల్సిన ఆరో విడత కీలక అణు చర్చలు రద్దయ్యాయి. ఇజ్రాయెల్‌ను తమపైకి ఎగదోస్తున్న అమెరికా చర్చలు అర్థరహితమని ఇరాన్ ప్రకటించింది. చర్చలకు సాయపడేందుకు బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు తామూ సిద్ధమని జర్మనీ పేర్కొంది.

# ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు.. భారతీయులకు అడ్వైజరీ

**ఇంటర్నెట్ డెస్క్:** ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య దాడులతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లోని భారతీయులకు అక్కడి మన రాయబార కార్యాలయం పలు సూచనలు జారీ చేసింది. దేశంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. ఎవరూ భయాందోళనకు గురికావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. అదేవిధంగా టెహ్రాన్‌లోని దేశ రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలి. అనవసర ప్రయాణాలు మానుకోవాలి. రాయబార కార్యాలయం సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలి. స్థానిక అధికారులు సూచించిన భద్రతా నిబంధనలు పాటించాలి" అని టెహ్రాన్‌లోని భారత



రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఓ గూగుల్ ఫాంను పోస్ట్ చేసి.. భారత పౌరులు తమ వివరాలను పొందుపర్చాలని సూచించింది. స్థానిక పరిస్థితులపై తాజా వివరాల కోసం ఓ టెలిగ్రామ్ లింక్‌ను షేర్ చేసింది. అదేవిధంగా హెల్ప్‌లైన్ నంబర్లను పోస్ట్ చేసింది. ఇరాన్‌లోని అణు, ఆయుధ, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో టెహ్రాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని, క్షిపణి వ్యవస్థలను సమూలంగా నిర్మూలించడమే తమ ధ్యేయమని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో ఇది ఆరంభం మాత్రమేనని, మరిన్ని వైమానిక, క్షిపణి దాడులు చేపడతామని చెప్పారు. ఈ క్రమంలోనే ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివసించే పౌరులు తక్షణమే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఐడీఎఫ్ కోరింది.

# వీరంతా మృత్యువును తప్పించుకున్నారిలా..

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం చరిత్రలో పెను విషాదంగా నిలిచిపోనుంది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న మొత్తం 242 మంది ప్రయాణికులలో 241 మంది మృతి చెందారు. విశ్వాస్ రమేష్ అనే ప్రయాణికుడు మాత్రం ప్రమాదం నుంచి బయపడ్డారు. అయితే తల్లి మాట కారణంగా యమన్ వ్యాస్, సరైన పత్రాలు లేక జామిని, ప్రియా పటేల్, ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి భూమి చౌహాన్ ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం జరిగిన జూన్ 12న గుజరాత్‌కు చెందిన యమన్ వ్యాస్ అదే విమానంలో ఎక్కేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. కుమారునికి వీడ్కోలు పలికే సమయంలో వ్యాస్ తల్లి భావోద్వేగానికి లోనయ్యింది. 'కొన్ని రోజులు ఇక్కడే ఉండవచ్చు కదా' అని అడిగింది. అంతే తల్లి ప్రేమకు తలొగ్గిన వ్యాస్ వెంటనే తన విమాన టికెట్‌ను రద్దు చేసుకున్నాడు. ఈ విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే నేల కూలింది. విమాన ప్రమాదం వార్త వినగానే యమన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. తన తల్లే తనను కాపాడిందని ఆయన మీడియాకు తెలిపారు. యమన్ వ్యాస్ కొన్నేళ్లుగా యూకేలో పనిచేస్తున్నారు. రెండేళ్ల తర్వాత వడోదర వచ్చారు. తన కుటుంబంతో కొన్ని రోజులు ఉన్నాక, తిరిగి లండన్‌కు బయలుదేరారు. అయితే అతని తల్లి పట్టుబట్టడంతో తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో ఆయన విమాన ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అహ్మదాబాద్‌లోని చంద్లోడియాకు చెందిన జామిని, ప్రియా పటేల్ కూడా ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీరు తమ స్నేహితుని



ఆహ్వానం మేరకు ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానంలో లండన్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరు విజిటర్ వీసాపై ప్రయాణానికి బయలుదేరారు. అయితే వీరి దగ్గర కొన్ని పత్రాలు లేని?? కారణంగా, విమానం ఎక్కేందుకు అనుమతి లభించలేదు. దీంతో నిరాశగా ఇంటికి తిరుగుముఖం పట్టారు. ఇంతలో విమాన ప్రమాదం గురించి వారికి తెలిసింది. ఇదేవిధంగా భారత్‌కు వచ్చిన బ్రిటన్ నివాసి భూమి చౌహాన్ అహ్మదాబాద్‌లో భారీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. దీంతో ఆమె విమానాశ్రయానికి చేరుకోవడంలో ఆలస్యమైంది. దీంతో ఆమె విమానం ఎక్కలేకపోయారు.

## పుణెలో ఘోర ప్రమాదం

ఇంటర్నెట్ డెస్క్: పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై



కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## నా భార్యకింకా తెలియదు..!

**అహ్మదాబాద్:** ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం బీజే మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఓ టీ స్టాల్ వెనక కూలింది. ఆ టీ కొట్టు నడిపే సీతాబెన్ అనే మహిళ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. కాలిన గాయాలతో బతికి బయటపడింది. చెట్టుకింద టీస్టాల్లో నిద్రపోతున్న 14 ఏళ్ల కుమారుడు ఆకాశ్ మాత్రం మంటలకు



బలయ్యాడు. తన వెనకగా చెలరేగుతున్న మంటల నుంచి సీతాబెన్ తప్పించుకుని పరుగెత్తుకుంటూ వస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఐసీయూలో కోలుకుంటున్న ఆమె మీడియాతో మాట్లాడింది. "నేను విమానాన్ని చూడలేదు. కానీ భారీ శబ్దం విన్పించింది. వెంటనే మంటలు, పొగ కమ్ము కుంటుండటంతో ఏమీ కన్పించకుండా పోయింది. భయపడి పరుగులు తీశాను" అంటూ గుర్తు చేసుకుంది.

**నా భార్యకింకా తెలియదు**

సీతాబెన్ భర్త సురేశ్‌కుమార్ కూడా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. "ప్రమాద సమయంలో నేను ఇంట్లో ఉన్నా. టీ స్టాల్లో ఉన్న నా భార్యకు ఆకాశ్ లంచ్ బాక్స్ తీసుకెళ్లాడు. తర్వాత అక్కడే పడుకుని ప్రమాదానికి బలైపో యాడు" అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. "ఈ ఘోరం గురించి నా భార్యకు ఇంకా చెప్పలేదు. నా కొడుకు మృతదేహం గుర్తించలేనంతగా కాలిపోయింది. దాంతో పరీక్షల నిమిత్తం నా డీఎన్ఏ నమూనా ఇచ్చా" అంటూ గుండెలవిసేలా రోదించాడు.

## దక్షిణార్థ దేశాల గొంతుకకు జీ7 వేదిక

దిల్లీ/ నికోసియా

కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్థ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నానని తెలిపారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం దిల్లీ నుంచి బయలుదేరిన ఆయన సైప్రస్ చేరుకున్నారు. బయలుదేరే ముందు ఒక ప్రకటన విడుదల చేశారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటంలో భారత దేశానికి మద్దతు ఇచ్చినందుకు భాగస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రపంచ వ్యాప్తంగా అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం అవుతుందని అభిప్రాయపడ్డారు.

**సైప్రస్‌లో మోదీ**

ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 'సైప్రస్‌లో దిగా. నాకు స్వాగతం పలికిన అధ్యక్షుడికి కృతజ్ఞతలు. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుంది. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పని చేసే అవకాశముంది' అని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఐరోపా కూటమికి ఆగ్నేయ తీరంగా, మధ్యధరా గేట్ వేగా ఉన్న సైప్రస్ తరఫున ప్రధాని మోదీకి స్వాగతం. ఈ చారిత్రక పర్యటన ద్వారా హద్దులు లేని వ్యూహాత్మక భాగస్వామ్యంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నాం. కలిసి మరింత ముందుకు సాగడానికి, పరివర్తనకు, అభివృద్ధికి ఇది నాంది పలకబోతోంది' అని క్రిస్టోడౌలిడెస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సైప్రస్‌లో ప్రధాని మోదీ బస చేసిన హోటల్‌వద్ద ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. వారితో ప్రధాని సమావేశమయ్యారు. వాణిజ్య ప్రముఖులతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

## విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

అహ్మదాబాద్

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించినవారిలో ఒకరైన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ మృతదేహాన్ని గుర్తించారు. ఆయన కుటుంబ సభ్యుల నమూనాలతో మృతదేహం డీఎన్‌యే సరిపోలింది. విషయాన్ని రూపాణీ కుటుంబానికి ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తెలిపారు. భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాక సోమవారం ఆయన స్వస్థలం రాజ్‌కోట్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇప్పటిదాకా 80 మంది మృతదేహాలను డీఎన్‌యే ద్వారా గుర్తించారు. 33 మంది మృతదేహాలను, మరణ ధ్రువీకరణ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలో రెండో బ్లాక్‌బాక్సును కూడా స్వాధీనం చేసుకున్నారు. దీనిలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ ఉంది.

**కనీసం మృతదేహాలైనా ఇవ్వండి**

డీఎన్‌యే పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద పరిస్థితి హృదయవిదారకంగా ఉంది. మృతుల శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం ఒక ఎత్తయితే వాటిని ఆయా కుటుంబాలు అంగీకరించి తీసుకువెళ్లడం మరో ఎత్తు. మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే బంధువులు అంగీకరించలేకపోతున్నారు. ముక్కలుగా కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామని వారు ప్రాధేయపడుతున్న తీరు గుండెల్ని మెలిపెడుతోంది.

## కుప్పకూలిన హెలికాప్టర్

రుద్రప్రయాగ్/న్యూఢిల్లీ

భక్తిశ్రద్ధలతో చార్‌ధామ్ యాత్ర చేస్తున్న యాత్రికులను ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున హిమ సానువుల్లోని కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించుకుని తిరిగొస్తున్న భక్తులు హెలికాప్టర్ కూలి ప్రాణాలు కోల్పోయారు. గౌరీకుండ్ అడవుల్లో ఈ దారుణం జరిగింది. రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ అధికారి నందన్ సింగ్ రజ్వార్ వివరాలను వెల్లడించారు. ఆర్యన్ ఏవియేషన్ సంస్థకు చెందిన బెల్ 407 హెలికాప్టర్ ఉదయం 5.19 గంటలకు కేదార్‌నాథ్ నుంచి గుప్తకాశీ బయల్దేరింది. కాసేపటికే కేదార్‌ఘాటీలో గౌరీకుండ్, త్రిజుగ్ నారాయణ్ ప్రాంతాల మధ్య అడవిలో కుప్పకూలింది. అందులోని ఏడుగురూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మహారాష్ట్రకు చెందిన జంట, వారి రెండేళ్ల పాప, పైలట్‌తో పాటు బద్రీనాథ్%–%కేదార్‌నాథ్ ఆలయ కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్ కూడా ఉన్నారు. పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ ఆర్మీలో 15 ఏళ్లపాటు పైలట్‌గా చేశారు. కేదార్‌నాథ్‌లో హెలికాప్టర్లు అటూ ఇటూ ఎత్తైన పర్వతాల మధ్య లోయ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రతికూల వాతావరణం, మేఘావృతమైన పొగమంచు గుండా ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించడం ప్రమాదానికి దారి తీసి ఉంటుందని భావిస్తున్నారు. మృతుల్లో మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలవారు.

**నెలన్నరలో ఐదో ప్రమాదం**

ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర మొదలైనప్పటి నుంచి హెలికాప్టర్లు కూలిపోవడం ఐదోసారి. ఈ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రలో హెలికాప్టర్ సేవలను రెండు రోజులు నిలిపేస్తున్నట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. ఆర్యన్ ఏవియేషన్ సంస్థ హెలికాప్టర్ కార్యకలాపాలను తక్షణం నిలిపివేస్తూ డీజీసీఏ ఆదేశాలిచ్చింది. కేదార్‌నాథ్ లోయలో రాకపోకలు సాగించే అన్ని హెలికాప్టర్ల నాణ్యత, సామర్థ్యాలను తక్షణం సమీక్షించేందుకు అధికారులను పంపుతోంది. దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) సమగ్ర దర్యాప్తు చేయనుంది. "ఇలాంటి ఘటనల్లో జవాబుదారీతనం పెంచాలి. దర్యాప్తు, భద్రతా ప్రమాణాల అంశంలో కేంద్ర, రాష్ట్రాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" అని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు.

## హడలెత్తించిన ఎయిరిండియా విమానం

గువాహటి

అహ్మదాబాద్ ప్రమాదాన్ని మరవకముందే గువాహటి–కోల్‌కతా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం 170 మంది ప్రయాణికుల్ని




హడలెత్తించింది. చివరికి 18 గంటల తర్వాత వారిని మరో విమానంలో పంపించారు. శనివారం రాత్రి 9.20 గంటలకు గువాహటి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరిన విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో రన్‌వేపై ఆపేశారు. ప్రయాణికులు రెండుసార్లు విమానం దిగాల్సి వచ్చింది. దీనిపై దుమ్మెత్తిపోసతఊ వారు పోస్ట్ చేసిన వీడియోలు వైరలయ్యాయి. "అర్థరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో మమ్మల్ని కిందికి దిగమన్నారు. చౌక హోటల్‌లో వసతి కల్పించారు. కనీసం టిఫిన్ కూడా పెట్టలేదు. ఆదివారం ఉదయం 9.30కు విమానం ఎక్కించి, కాసేపటికే మళ్లీ దించారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 3.34కు మరో విమానంలో కోల్‌కతా బయలుదేరాం" అని ఓ ప్రయాణికుడు తెలిపారు. వారి ఆరోపణలను ఎయిరిండియా ఖండించింది. "నగరంలోని బెస్ట్ హోటల్‌లో వసతి కల్పించాం. మా సిబ్బందీ అందులోనే ఉన్నారు" అని చెప్పింది. సమస్యలేమిటో మాత్రం వెల్లడించలేదు.

# మట్టిని మట్టుపెడుతున్న మందు

పుడమి గర్భంలోని జీవాన్ని హరిస్తున్నది కలుపు కాదు, కలుపును చంపేందుకు మానవులు చేస్తున్న చర్యలే. దానికి మూలకారణం గ్లైఫోసేట్' అనే నాన్-సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవమనేదే మిగలదు. ఈ రసాయనం పడిన చోట మట్టి శ్వాస కూడా తీసుకోలేదు. పంటల మీద పడితే మాడిపోతాయి. ఆ మందు వాడిన గడ్డిని తినే మూగజీవాలు సైతం చనిపోతాయి. రైతులు తీవ్ర అనారోగ్యాల బారినపడతారు. భూమిలో జీవానికి, భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును చాలా దేశాలు నిషేధించాయి. కానీ, మన దేశంలో మాత్రం యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుగుతుండటం శోచనీయం. అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ 1970లో మొదటిసారిగా గ్లైఫోసేట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది మొక్కల్లోని ఒక ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి, మొక్కల ఎదుగుదలను అడ్డగిస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు నివారణ కోసం వాడుతున్నప్పటికీ, ఇది పంటలు, మట్టిలోని ఇతర జీవులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. కూలీల ఖర్చులను తగ్గించేందుకు రైతులు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కలుపును నివారిస్తున్నట్టు అన్నదాతలు భావిస్తున్నారు. కానీ, దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోయి దిగుబడి పడిపోతుంది. అంతేకాదు, కర్షకులు కూడా రోగాల బారినపడి అనవసర ఖర్చుల భారం మోయాల్సి వస్తుంది. గ్లైఫోసేట్ పిచికారి మూలంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్టు 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. ఎయిమ్స్ నివేదిక ప్రకారం.. గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల వృద్ధిలో లోపాలు 18 శాతం వరకు పెరిగాయి. గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. తద్వారా వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. దీని వాడకం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐరాస ఐపీపీసీ-2022 నివేదిక స్పష్టం చేసింది. జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఈ రసాయనంపై నిషేధం



కొనసాగుతున్నది. 2018లో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈ రసాయనాన్ని ఉత్పత్తి చేస్తున్న కంపెనీపై ఓ రైతు కేసు వేశాడు. దుష్ప్రభావాలు ఉన్నట్టు రుజువు కావడంతో సదరు రైతుకు 289 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి వచ్చింది. అమెరికాలో ఈ కంపెనీపై ఇప్పటివరకు ఇలాంటి కేసులు లక్షకు పైగా దాఖలయ్యాయి. ఆహార పదార్థాల్లో గ్లైఫోసేట్ అవశేషాలు ఎక్కువవుతున్నాయని కెనడాలో హెచ్చరికలు జారీ అయ్యాయి. 2022 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం దీనిపై పాక్షిక నిషేధం విధించింది. కానీ, అది నామమాత్రమే. రసాయన కంపెనీల ప్రలోభాలకు లోనై పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని ప్రోత్సహిస్తుండటం విషాదం. ఏపీ, తెలంగాణల్లో గతంలో 60 రోజులపాటు తాత్కాలికంగా నిషేధించారు. కానీ, ప్రస్తుతం ఇది మార్కెట్లలో విచ్చలవిడిగా లభిస్తున్నది. తమకు అధికారం లేకపోయినా కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కానీ, ఏపీ, తెలంగాణల్లో మాత్రం ఆ సంకల్పం కొరవడింది. ఈ రసాయనాన్ని వినియోగిస్తున్న రైతులు ఆర్థికంగా, శారీరకంగా చితికిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు తమ బాధ్యతను మరిచి కార్పొరేట్ కంపెనీల ప్రలోభాలకు తలొగ్గడంతో అన్నదాతల జీవితాలు ఆవిరైపోతున్నాయి. ఇప్పటికైనా గ్లైఫోసేట్‌పై శాశ్వత నిషేధం విధించాలి. జీవ, సేంద్రియ కలుపు నివారణ పద్ధతులను అభివృద్ధి చేయాలి. రైతులకు అవగాహన కల్పించాలి. రైతు శ్వాస ఆగకూడదంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్తు పంటల భద్రత కోసం ట్గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం పాడాలి. ఒక్క రైతే కాదు, మట్టి, ఒక తరం, దేశ భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. దీన్ని మౌనంగా చూస్తూ ఉంటే మనం కూడా మట్టి గొంతు పిసికినవాళ్లమవుతాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు జీవరక్షణ యజ్ఞాన్ని ప్రారంభించాలి.

# తూర్పు ఆఫ్రికాలో ఇనుపపాము

తూర్పు ఆఫ్రికాలోని ప్రాంతాలను అనుసంధానించడానికి, కెన్యా నుంచి ఉగాండా వరకూ రైలు మార్గాన్ని నిర్మించాలని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు నిర్ణయించారు. చౌక శ్రమశక్తికి వెసులుబాటు కల్పించిన బానిసత్వ వ్యవస్థ అప్పటికే రద్దయ్యింది. దీంతో రైలు మార్గాన్ని నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపాదికన, తక్కువ ధరలో ఒప్పంద కార్మికులను భారతదేశం నుంచి తెచ్చుకోవచ్చు అనుకున్నారు తూర్పు ఆఫ్రికా వలస పాలకులు. దానికోసం 'ఇంపీరియల్ బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీ'ని 1888లో స్థాపించి, 1896లో మొంబాసా నుంచి విక్టోరియా సరస్సు దాకా రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అవసరమైన కార్మికులు, సహాయక అధికారులను నియమించడానికి బాధ్యత వహించే ఒక ఏజెంట్‌ను కరాచీలో నియమించారు. ప్రధాన నియామక కేంద్రమైన లాహోర్‌లో ఒక బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశంలో రైల్వే నిర్మాణాన్ని ప్రారంభించిన దాదాపు 40 సంవత్సరాల తరువాతనే, తూర్పు ఆఫ్రికాలో రైళ్ల నిర్మాణ ఆలోచన మొదలయింది. భారతదేశంలో అటువంటి నిర్మాణ పనుల్లో పనిచేసిన కార్మికుల మీద బ్రిటిష్ వారి దృష్టి పడింది. ఉచిత ప్రయాణం, ఉచిత భోజనం, జీతం, ఉచితంగా తిరుగు ప్రయాణం లాంటి జనాకర్షక హామీలతో, పంజాబ్‌లోని గ్రామాల నుంచి కేవలం మగ, యువకార్మికులను సమీకరించగలిగారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి చెందిన ప్రత్యేక చార్టర్డ్ స్టీమర్లలో వారినందరినీ కరాచీకి పంపారు. అక్కడి నుంచి మొంబాసాకు దాదాపు 3వేల మైళ్లు, తొమ్మిది రోజుల ప్రయాణం. 1896 జనవరి 24న మొంబాసాలో 350 మంది పంజాబీల మొదటి జట్టుతో ఒప్పంద కార్మిక వ్యవస్థ అక్కడ ప్రారంభమైంది. 7,500 మంది నైపుణ్యం ఉన్న కార్మికులు, 20 వేల మంది నైపుణ్యం లేని కార్మికులు భారతదేశం నుంచి వెళ్లారు. మొత్తం మీద, రైల్వే నిర్మాణంలో 32 వేల మంది భారతీయులు ఉపాధి పొందారు. 1898లో రైల్వే నిర్మాణం 100 మైళ్ల దూరం వరకూ సాగింది. తీరం నుంచి 326 కి.మీ దూరంలో ఉన్న నైరోబీకి మే 1899లో చేరుకుంది. ఆ తరువాత అక్కడ అది కీలకమైన ఓడరేవు అయింది. అయితే 200 మైళ్ల ప్రయాణం తరువాత, రైల్వే నిర్మాణంలో అత్యంత భయంకరమైన అధ్యాయాలలో ఒకటి 1898లో త్సావో నది మీద వంతెన నిర్మాణ సమయంలో జరిగింది. నరమాంస భక్షక మగ సింహాల జత, కార్మికుల శిబిరాలకు చేరి, రాత్రిపూట గుడారాలలో నిద్రిస్తున్న కార్మికులను బయటకు లాగి భక్షించేవి. పది నెలల పాటు కొనసాగిన ఆ దాడిలో వందమందికి పైగా మరణించారు. వందలాది మంది కార్మికులు త్సావో నుంచి పారిపోవడంతో రైల్వే నిర్మాణం దాదాపు ఆగిపోయింది. ఆ సింహాలు కొంతకాలం తర్వాత, పనిలో ఉన్న పురుషులను వెంబడించడంలో నిపుణులయ్యాయి. సింహాలు అనుసరించిన పద్ధతులు అసాధారణమైనవి కావడంతో, ఆ రెండు మగ సింహాలూ కచ్చితంగా సింహాల శరీరంలోకి ప్రవేశించిన దెయ్యాలని భారతీయ కార్మికులు నమ్మడం మొదలుపెట్టారు. సింహాలను అంతం చేసే పని రైల్వే నిర్మాణాన్ని పర్యవేక్షించే ఇంజనీర్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ ప్యాటర్సన్ మీద పడింది. వారాల తరబడి నిరంతరాయంగా వెంబడించిన తర్వాత, ప్యాటర్సన్ ప్రాణాలకు తెగించి సింహాలను అంతం చేయగలిగాడు. వీటి నిర్మూలన ఆ రైల్వే చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయానికి ముగింపు పలికింది. 'దెయ్యం' 'చీకటి' అనే మారుపేరుతో వాటిని చెప్పుకునేవారు. రైలు నైరోబీ రైల్వే రిఫ్ట్ వ్యాలీ వైపు మళ్లిన తర్వాత ఆ ప్రాంతం మరీ ప్రమాదకరంగా మారింది. నిర్మాణం త్సావో నదికి చేరుకోకముందే, రైల్వే




కార్మికుల మీద అక్కడి మాసాయి తెగ భయంకరంగా దాడి చేసింది. దానికి కారణం గతంలో (నవంబర్ 1895) ఇద్దరు మాసాయి గిరిజన బాలికల మీద అత్యాచారం జరగడమే. దానికి ప్రతిక్రియగా, మాసాయి తెగ దాదాపు ఆరు వందల మందికి పైగా రైల్వే కార్మికులను హతమార్చింది. మరొక ముఖ్యమైన ప్రతిబంధకం... అక్కడి సెత్సే దోమల కాటు. ఇవి కార్మికులలో నిద్ర జబ్బును సృష్టించేవి. క్లిష్టమైన భూభాగం కారణంగా చాలామంది మలేరియా, నల్ల జ్వరంతో మరణించారు. అనేక మరణాలకు అక్కడ ఏ వైద్య సదుపాయాలూ లేవు. పేలుడు పదార్థాలతో పని చేయడం వల్ల, వడదెబ్బల వల్ల, సొరంగాల తవ్వకాలలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. విక్టోరియా సరస్సుకి దగ్గరగా రైలు మార్గం విస్తరించడంతో నిర్మాణ పనుల్లో ఆటంకాలు మరింత పెరిగాయి. కార్మికుల పరిస్థితి మరింత దిగజారింది. అయినా భారతీయ ఒప్పంద కార్మికుల అకుంఠిత కృషి కారణంగా రైల్వే అథారిటీ ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది. 1899లో తీరం నుంచి నైరోబీ వరకు, 1900 నాటికి నకురు ప్రాంతం వరకూ రైల్వే పనులు పూర్తయి, 1901లో విక్టోరియా సరస్సు తీరంలో కిసుము ప్రాంతానికి రైల్వే అథారిటీ చేరుకుంది. మొంబాసా నుంచి కిసుము దాదాపు 560 మైళ్ల దూరంలో ఉంది. కిసుముకు చేరుకునే నాటికి దాదాపు 2,500 మంది మరణించారు. 1903 నాటికి విక్టోరియా సరస్సు వరకు రైలు మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. పూర్తిగా స్థానిక కార్మికులపై ఆధారపడి ఉంటే రైల్వే నిర్మాణం కనీసం ఇరవై సంవత్సరాలు పట్టేదని బ్రిటిష్ అధికారులే భావించారు. ఆ ప్రశంస, కీర్తి అక్కడి ఒప్పంద భారతీయ కార్మికులకే చెందుతాయి. రైల్వేను నిర్మించడానికి మొత్తం 31,983 మంది భారతీయ కార్మికులు పని చేశారు. 6,454 మంది వ్యక్తులు ట్రాక్‌లు వేయడం మూలంగా అశక్తులయారు. రైల్వే నిర్మాణం పూర్తయిన తర్వాత 6,724 మందిని వారి సంరక్షిత రాజ్యంలో పని చేసేందుకు తీసుకున్నారు. వీరిలో 2,000 మందిని మాత్రమే రైల్వే శాఖల్లో నియమించుకున్నారు. ఆఫ్రికా సమాజానికి ఆ రైల్వే అనేక విధాలుగా ఉపయోగపడింది. భారతీయ ఒప్పంద కార్మికులు పోషించిన పాత్రతో తరువాత ఆఫ్రికా సమాజంలో అనేక మార్పులొచ్చాయి. రైల్వే నిర్మాణానికి ప్రారంభ ఖర్చు 50 లక్షల డాలర్లుగా నిర్ణయించబడినా, దాని నిర్మాణానికి బ్రిటిష్ వారికి 90 లక్షల డాలర్ల వరకూ ఖర్చయింది. అది పార్లమెంటులోను, మీడియాలోను తీవ్ర ఆగ్రహాన్ని సృష్టించింది. నిర్మాణం ప్రారంభించకముందే, ఈ ఆలోచనను వ్యతిరేకించినవారు చాలా మంది ఉన్నారు. వీరిలో ఒకరైన హెన్రీ లాబౌచెర్ కామన్స్ సభలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జ్ కర్జన్‌ను ఇలా ఆక్షేపించాడు: 'దీనికి ఎంత ఖర్చవుతుందో ఏ పదాలూ చెప్పలేవు/ దాని లక్ష్యం ఏమిటో ఏ మెదడూ ఊహించలేదు/ అది ఎక్కడి నుంచి మొదలవుతుందో ఎవరూ కనిపెట్టలేరు/ అది ఎక్కడికి వెళుతుందో ఎవరికీ తెలియదు... స్పష్టంగా అది ఒక ఉన్మాద లైను తప్ప మరొకటి కాదు' అని. ఉగాండా రైల్వేను లూనాటిక్ (ఉన్మాద/పిచ్చి) అనే పదంతో పేర్కొనడం అదే మొదటిసారి. 'లూనాటిక్ ఎక్స్‌ప్రెస్' అనే పదాన్ని చార్లెస్ మిల్లర్ 1971లో తన పుస్తకం 'ది లూనాటిక్ ఎక్స్‌ప్రెస్: యాన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇన్ ఇంపీరియలిజం'లో ఉపయోగించాడు. అయితే కొంతమంది స్థానికులు ఆ ఎక్స్‌ప్రెస్‌ను 'ఇనుప పాము' అని పిలుచుకున్నారు. దానికి కారణం%-% ఇప్పుడు కెన్యాగా పిలువబడే ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, వారి భూములను దోచుకుంటుందని, దారిలో విధ్వంసం సృష్టిస్తుందని, ఆ మృగం, ఇంతకు ముందెన్నడూ చూడని ఒక రకమైన విదేశీయుడిని తీసుకువస్తుందని, ఒక రోజు వారి భూమిని పరిపాలించే వింతైన ఎర్రటి జుట్టు గల వ్యక్తిని తీసుకొస్తుందని' అతను చెప్పాడు. అతను చేసిన ప్రవచనం ఒక విషయాన్ని స్పష్టపరిచింది%-% అక్కడి ప్రజలకు కష్టాలు రాబోతున్నాయని! కిమ్నియోల్ ప్రవచనాలు నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆ ప్రజల జీవితాలను ఆయన కూడా ఊహించలేని విధంగా మార్చింది. ఆశ్చర్యంగా బ్రిటిష్ పత్రికలు సైతం దానిని 'ఇనుప పాము' అనే అన్నాయి, ఎందుకంటే దాని నిర్మాణ సమయంలో అపారమైన సంపద వృథా అయింది. ఆ ప్రాంతంలో నివసించిన తెగలు రైల్వే నిర్మాణాన్ని ప్రతిఘటించాయి. ఈ రైలు మార్గం ఉగాండా, కెన్యా అంతర్భాగాలను, కెన్యాలోని హిందూ మహాసముద్ర నౌకాశ్రయాన్ని మొంబాసాతో అనుసంధానించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో తూర్పు ఆఫ్రికాలో జర్మనీని ఓడించడానికి బ్రిటిష్ వారికి సహాయపడి, ఇతర వలస రాజ్యాలతో కమ్యూనికేషన్ కొనసాగించడానికి చాలా ముఖ్యమైనదిగా మారింది. రైల్వే రాకముందు నైరోబీ జనావాసాలు లేని చిత్తడినేల. నేడు నైరోబీ కెన్యాలో ముప్పై లక్షలకు పైగా జనాభా ఉన్న అతిపెద్ద నగరం. నిద్రాణస్థితిలో ఉన్న తీరప్రాంతం మొంబాసా అనంతరం పట్టణమై, ఆధునిక ఓడరేవుగా రూపాంతరం చెందింది. కెన్యాతో పోలిస్తే ఉగాండాకు ఇప్పుడు వ్యవసాయం నుంచి సమృద్ధిగా రాబడి వస్తోంది. 1938 నాటికి, పత్తి సాగు ఒక్కటే 30 లక్షల ఎకరాల భూమిని ఆక్రమించింది. 1900%-%04 సంవత్సరాల మధ్య బ్రిటిష్ తూర్పు ఆఫ్రికా కమిషనర్‌గా ఉన్న చార్లెస్ ఎలియట్ వీటన్నింటినీ గమనించి ఇలా వ్యాఖ్యానించాడు: 'ఒక దేశం రైల్వేను సృష్టించడం అసాధారణం కాదు, కానీ రైల్వేనే ఒక దేశాన్ని సృష్టించడం అసాధారణం.'

# సింధు జీవధార సమరాయుధమా

ఒక దేశం యుద్ధంలో ఉన్నప్పుడు ఆ దేశ ప్రజలు, నాయకులు శత్రుదేశానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రకటనలు చేస్తారు. అవి ఆచరణ సాధ్యంకాకున్నా సరే. కానీ, బాధ్యతాయుతమైన నాయకులు ఆ ప్రకటనలను పదేపదే పునరుద్ఘాటిస్తే దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిని నిశితంగా పరిశీలించవలసి ఉన్నది. సింధు నదీజలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ%-% ఐడబ్ల్యుటి) విషయంలో అటువంటి పరిస్థితే ఇప్పుడు భారత్‌కు తటస్థించింది. సింధు నదీజలాల ఒప్పందం గురించి రాజకీయవేత్తలు ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నప్పటికీ అది కాల పరీక్షకు నిలిచింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా వాటి ప్రభావం దాని అమలుపై పడలేదు. ఆ ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా కొందరు ఘోషిస్తున్నారు. ఇది వివేకవంతమైన అభిప్రాయం కాదు. అంతకంటే మెరుగైన, ఉభయత్రా మేలైన ఒప్పందం ఇప్పుడు సాధ్యంకాదు. ఇరుగు పొరుగు దేశాలతో ఉమ్మడి నదీ పరీవాహక ప్రాంతాలున్న దేశం భారత్ మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా కనీసం 286 నదీ పరీవాహక ప్రాంతాలను ఒకటి కంటే ఎక్కువ దేశాలు కలిగి ఉన్నాయి. 150కి పైగా దేశాలు వివిధ నదీ పరీవాహక ప్రాంతాలను పంచుకుంటున్నాయి. రాజకీయ సరిహద్దులను అధిగమించే నదీ పరీవాహక ప్రాంతాలు ప్రపంచ భూ విస్తీరణంలో 42 శాతంగా ఉన్నాయి. ఈ పరీవాహక ప్రాంతాలలో 300 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ రివర్ బేసిన్‌ల నిర్వహణ, యాజమాన్యం వివిధ ఒప్పందాలకు అనుగుణంగా జరుగుతోంది. మన దేశం వివిధ నదీ పరీవాహక ప్రాతాలను డజన్‌కు పైగా దేశాలతో పంచుకుంటున్నది. ఆయా ప్రాంతాలకు భారత్ ఎగువ దేశంగాను, దిగువ దేశంగాను ఉన్నది. నదీజలాల పంపకానికి సంబంధించి అనేక అంతర్జాతీయ ఒప్పందాలు, మార్గదర్శక సూత్రాలు, చారిత్రక రివాజులు ఉన్నాయి. ప్రపంచ అగ్రరాజ్యంగా ప్రభవించాలని ఆకాంక్షిస్తున్న భారత్ వాటన్నిటినీ గౌరవించవలసి ఉన్నది. అది అనివార్యం. నీరు, ప్రాదేశిక హక్కులు ఉన్న భూమి కాదు. నది సదా దిగువకే ప్రవహిస్తుంది. వివిధ చట్టాల ప్రకారం నీటి నిర్వహణ, యాజమాన్యం ఉంటుంది. ఇది ఎవరూ కొట్టివేయలేని సత్యం. నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) కొంతమేరకు భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని సింధు ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది. ఈ ఒప్పందం సమకూర్చిన ఏర్పాటును భారత్ స్వయంగా కోరుకున్నదే. ఇటువంటి ఏర్పాటుకు భారత్ 1954లో సానుకూలత చూపగా పాకిస్థాన్ దాన్ని అంగీకరించేందుకు చాలా సంవత్సరాలు తీసుకున్నది. ఐడబ్ల్యుటి కింద సింధు నదీ వ్యవస్థను పశ్చిమ, తూర్పు నదులుగా విభజించారు. పశ్చిమ నదులు అయిన జీలమ్, చీనాబ్, ఇండస్‌ను పాకిస్థాన్‌కు కేటాయించారు. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ నదుల నీటిని భారత్ చాలా పరిమితంగా మాత్రమే వినియోగించుకోవలసి ఉన్నది. ఆ నదులలో మొత్తం ప్రవాహ పరిమాణంలో ఎటువంటి తేడా సంభవించకుండా ఉండేలా మాత్రమే వినియోగించుకోవాలి. ఈ ప్రకారం ఆ మూడు పశ్చిమ నదులపై భారత్ ఎటువంటి ఆనకట్టలు నిర్మించకూడదు. తూర్పు నదులు అయిన రావి, బియాస్, సట్లేజ్‌లను భారత్‌కు కేటాయించారు. ఈ మూడు నదులు పాకిస్థాన్‌లోకి ప్రవేశించేంతవరకు వాటిపై పూర్తి నియంత్రణ భారత్‌కు ఉంటుంది. ఈ నదులలోని ప్రతి చుక్క నీటిని భారత్ వినియోగించుకోవచ్చు. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నీరు ప్రవహించకుండా చేసేందుకు కూడా భారత్‌కు హక్కులు ఉన్నాయి. పాకిస్థాన్‌కు ఆ నదులు ప్రవహించకుండా భారత్ అడ్డుకున్నా అది ఐడబ్ల్యుటి ఉల్లంఘన కిందకు రాదు. సింధు నదీపరివాహక ప్రాంతం నాలుగుదేశాల%-% పాకిస్థాన్, భారత్, చైనా, అఫ్ఘానిస్తాన్%-%లో 1.14 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. సింధు ఆయకట్టులో నివసిస్తున్న మొత్తం జనాభా 2025లో 320మిలియన్లు. 2050 సంవత్సరం నాటికి ఈ జనాభా 380 మిలియన్లకు పెరగవచ్చని అంచనా. ఈ జనాభాలో 110 మిలియన్ (35శాతం) భారత్‌లో ఉండగా 195 మిలియన్ (61శాతం) పాకిస్థాన్‌లో ఉన్నారు. మిగతా 4శాతం మంది అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నారు. చైనా పరిధిలో ఉన్న జనాభా సంఖ్య ఉపేక్షింపదగినది. పాకిస్థాన్ జనాభాలో 80 శాతం మంది, భారత్ జనాభాలో 8 శాతం మంది సింధు నదీపరివాహక ప్రాంతంలోనే నివసిస్తున్నారు. సింధు బేసిన్‌లో లభ్యమయ్యే మొత్తం ఉపరిత జలాల పరిమాణం 239 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎమ్). ఇందులో తూర్పు నదుల నుంచి ప్రవహించేది 73.3 బిసిఎమ్‌లు. ఈ జలాలపై భారత్‌కు సంపూర్ణ హక్కులు ఉన్నాయి. వివిధ ప్రాకృతిక కారణాల వల్ల భారత్ ఈ జలాలను పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. కేవలం 46 బిసిఎమ్‌లను మాత్రమే వినియోగించుకోగలుగుతుంది. భారత్ తన అవసరాలకు తగ్గట్టుగా ఈ నీటిని వినియోగించుకోవచ్చు. అయితే కేవలం 16.3 బిసిఎమ్‌లను మాత్రమే నిల్వచేసుకోగల సామర్థ్యం మాత్రమే కలిగి ఉంది. మిగతా జలాలు పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. వాటిని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉన్నది. అయితే వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యం భారత్‌కు లేదు. పాకిస్థాన్‌కు కేటాయించిన పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే సగటు నీటి సామర్థ్యం 165 బిసిఎమ్. ఐడబ్ల్యుటి ప్రకారం వాటిని సంపూర్ణంగా వినియోగించుకునే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నది. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ పశ్చిమ నదుల నీటిని మళ్లించేందుకుగానీ, నిల్వచేసుకునేందుకుగానీ భారత్‌కు హక్కు లేదు. ఐడబ్ల్యుటి ఇప్పటికే అంతర్జాతీయ అంశమయింది. పాకిస్థాన్ దాన్ని తన ప్రచారానికి, ఉగ్రవాదంపై చర్చను దారి మళ్లించేందుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటుంది. సాయుధ సంఘర్షణ కాలంలో నదీజలాల పరిరక్షణ విషయమై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్వహించిన ఒక సమావేశంలో భారత రాయబారి మాట్లాడుతూ సింధునది ఎగువ ప్రాంత దేశంగా భారత్ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వస్తోందని పునరుద్ఘాటిస్తూ ఐడబ్ల్యుటి పీఠిక ప్రస్తావించిన 'సుహృద్భావ, స్నేహ స్ఫూర్తిని పాకిస్థానే ఉల్లంఘించిందని విమర్శించారు. ఉగ్రవాదులు తుల్‌బుల్ నేవిగేషన్ ప్రాజెక్ట్‌పై కూడా దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదుల వల్ల ఆ ప్రాజెక్ట్ భద్రతకు, ప్రజల ప్రాణాలకు రక్షణ కొరవడుతోందని భారత రాయబారి అన్నారు. అదే సమావేశంలో పాకిస్థాన్ ప్రతినిధి సైమా సలీమ్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో 24కోట్ల ప్రజలకు ప్రాణరక్షకంగా ఉన్న సింధుజలాల ప్రవాహానికి భారత్ అవరోధాలు కల్పిస్తోందని అంటూ, 'నీరే ప్రాణం. అది సమరాయుధం కానేకాదు' అని వ్యాఖ్యానించారు. చెప్పవచ్చినదేమిటంటే ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలోను లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై విస్తృత చర్చల ద్వారా అది నిర్ణయమవుతుందనేది స్పష్టం. సింధు వివాదానికి ఇటువంటి పరిష్కారం కోసమే పాకిస్థాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది. పహల్గాం ఉగ్రఘాతుకానికి మొదటి ప్రతిస్పందనగా సింధు నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తామని భారత్ ప్రకటించింది. 2016లో కూడా భారత్ ఇటువంటి హెచ్చరికే చేసింది. అయితే అప్పుడుగానీ, ఆ తరువాత గానీ ఏమీ జరగలేదు. తమ పోరాటం ఉగ్రవాదుల నిర్మూలనకేనని భారత్ పదేపదే చెప్పుతుండగా ఐడబ్ల్యుటి అమలును నిలిపివేయడం తమ ప్రజలను అకారణంగా శిక్షించడమేనని పాకిస్థాన్ ఆక్రోశిస్తోంది. ఆపరేషన్ సిందూర్ పూర్వాపరాలను ప్రపంచ దేశాల నాయకులకు వివరించేందుకు మోదీ సర్కార్ పంపించిన భారత పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు ఐడబ్ల్యుటి అమలు నిలిపివేత విషయంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందుల నెదుర్కొన్నాయి. అంతర్జాతీయ పర్యవసానాలను ఉపేక్షించి పాకిస్థాన్‌కు ప్రవహించే సింధు జలాలను నిలిపివేసేందుకు భారత్ దృఢంగా నిర్ణయించుకుందనే అనుకుందాం. ఆ నిర్ణయాన్ని అమలుపరచడం సాధ్యమవుతుందా? సింధునదిపై భారత ప్రభుత్వ నివేదిక ఒకటి ఇండస్ బేసినులో సగటు నీటి లభ్యత 73 బిసిఎమ్ (బిలియన్ క్యూబిక్ మీటర్లు) పేర్కొంది. ఉపయోగించుకోగల మొత్తం ఉపరితల జలాల లభ్యత 46 బిసిఎమ్ అని, ప్రస్తుత 'లైవ్ స్టోరేజి కెపాసిటీ' 16.3 బిసిఎమ్ అని ఆ నివేదిక పేర్కొంది.

## బీసీ లందరూ రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి




సూర్య ప్రతినిధి మర్రిగూడ మర్రిగూడ మండలం లో బస్సు డిపో వద్ద ఆదివారం బీసీ మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు ముఖ్యఅతిథిగా బీసీ మన ఆలోచన సాధన సమితి అధ్యక్షుడు నర్సింగ్ రావు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ బీసీ లందరూ కలిసి రాజ్యాధికారా దిశగా ముందుకు సాగాలని చ్చారు ఈ కార్యక్రమంలో నల్ల యాదయ్య పగడాల రవి జిలకల కొండల్ ముదిరాజ్ మహేష్ లు పాల్గొన్నారు

## ఘనంగా రాముడు యాదవ్ జన్మదిన వేడుకలు



**గండిపేట్ : సూర్య ప్రతినిధి** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమ నాయకుడు రాముడు యాదవ్ నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డిలు ఆకాంక్షించారు. ఆదివారం రాముడు యాదవ్ జన్మదిన వేడుకలను జన్మదిన వేడుకలను కార్తీక్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల సమక్షంలో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిలు రాముడు యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాముడుయాదవ్ పార్టీకి అంకితా బావంతో పనిచేసే నాయకుడని, ఉద్యమకాలం నుంచి పార్టీ కోసం అంకితాభవంతో అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వ్యక్తి రాముడు యాదవ్ అని కొనియాడారు.

## ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన గోపి రజక

**బస్వరాజు సారయ్య కి మంత్రిపదవి ఇవ్వాలి : ఓరుగంటి వెంకటయ్య**



**హైదరాబాద్,( సూర్య ప్రతినిధి):** బహుజనుల ఆశాజ్యోతి అట్టడుగు స్థాయి నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ మంత్రిగా , సాధించుకున్న తెలంగాణలో ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులలో పనిచేసిన అనుభవజ్ఞులైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన శుభ సందర్బంగా ఆదివారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఎమ్మెల్సీ పార్టీ వివిధ ఉన్నత పదవులలో పనిచేసిన అనుభవం ఉన్నందున తక్షణమే మంత్రిపదవి ఇచ్చి గౌరవించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని కోరుతున్నామని రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య అన్నారు.

## గుగ్గిళ్ళ దివ్యమూర్తికి రియల్ ఎస్టేట్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపర మేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి నేలకొండపల్లిలో మండల రియల్ ఎస్టేట్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. రియల్ ఎస్టేట్ సంఘం మండల అధ్యక్షులు తెల్లగొర్ల లింగస్వామి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. డాక్టర్ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి శాలువాతో ఈ సన్మానం చేసినట్టు రియల్ ఎస్టేట్ సభ్యులు తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 112 చోట్ల సన్మానం జరిగిందని డాక్టర్ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కట్టెకోల చిన్ని కృష్ణయ్య చింతలపాటి భాస్కర్ కట్టెకోల వెంకటేశ్వర్లు సూరేపల్లి జ్ఞానరత్నం తోళ్ల వీరస్వామి తేజావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వేముల మహేందర్ 4వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయండి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా**



**భువనగిరి,సూర్య ప్రతినిధి:** ఈనెల 21వ తేదీన వలిగొండ పట్టణంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు, అనేక కూలీ, భూ పోరాటాలు నడిపిన అమరజీవి కామ్రేడ్ వేముల మహేందర్ 4వ వర్ధంతి సందర్భంగా " వ్యవసాయ కార్మికులు – ఉపాధి – పాలకుల వైఖరి " అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో వ్యవసాయ కూలీలు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. నేటికీ అనేక మంది వ్యవసాయ కూలీలు గ్రామీణ పేదలు సెంట్ భూమి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా వ్యాప్తంగా సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు నూతన పాస్ బుక్కులు లేకపోవడంతో అనేక రకాలైన ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్న పేదలందరికీ నూతన పాస్ బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేసినారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు కూడా నేటికీ చాలామందికి లేవని ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇల్లు లేని ప్రతి పేదవారికి రాజకీయాలకతీతంగా ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి నర్సింహ సూచించారు. అమరజీవి కామ్రేడ్ వేముల మహేందర్ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్య అతిథులుగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పాల్గొంటున్నారని నర్సింహ తెలియజేశారు.

## మన ఆలోచన సాధన సమితి జెండా ఆవిష్కరణ



**సంస్థాన్ నారాయణపుర్, సూర్య ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లికార్జున్ గౌడ్, వ్యవస్థాపక సభ్యులు వడ్డేపల్లి దశరథ్ విచ్చేసి జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 37 నియోజకవర్గాల్లో 135 గ్రామంలో జెండా ఆవిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో గ్రామ గ్రామాన ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. బీసీల ఐక్యత కోసం ప్రతి బీసీ నాయకులు పోరాడాలని సూచించారు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కొనియాడారు. బీసీ కులాలలో చైతన్యం సఖ్యత కోసం గత నెల రోజులుగా గ్రామ బాట కార్యక్రమాన్ని చేపడుతూ గ్రామాలలో కులవృత్తుల మధ్య సఖ్యత రాజకీయ చైతన్యాన్ని నింపుతూ గ్రామ బాట కార్యక్రమం కొనసాగిస్తూ ఈ వేడుకలను రాష్ట్ర కమిటీ సభ్యులచే నిర్వహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పు రామకృష్ణ, సింగం కృష్ణ,రాసమల్ల సంపత్, ఏలే నరసింహ, వినుకొండ రాములు, దోర్నాల అంజయ్య, దువ్వ నవీన్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదింటి కుటుంబాలకు ఇంటి నిర్మాణ సహకారం





**ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి**

**సంస్థాన్ నారాయణపుర్, ( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల చిమిర్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమ%శీ% కాంగ్రెస్ పార్టీ నాయకులు,చిమిర్యాల మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యములో దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలను,ఇల్లు లేని కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇల్లును ఇవ్వటం జరిగింది.ప్రజా పాలనలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన గృహలక్ష్మి,విద్యార్థులు సన్న బియ్యం,పంపిణీ గృహజ్యోతి,రాజీవ్ యువ వికాసము పథకాలను,గ్రామీణ ప్రాంతాలలో యువతకు చేరవేయాలని సంకల్పముతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆదేశానుసార%శీ% పేదలందరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందివ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కేసాని రాజు,మండల నాయకులు సుర్వి ముత్యాలు,మాజీ ఉపసర్పంచ్ సుర్వి రాజు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపిన - ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర్, సూర్య ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా వారిని నివాసంలో సంస్థాన్ నారాయణపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టి కోట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ఉచిత వైద్య శిబిరం: వారానికి ఉచిత కన్సల్టెన్సీ, భారీ డిస్కౌంట్లు ప్రకటించిన టీ ఆర్ జి హాస్పిటల్





**గండిపేట్ : ( సూర్య ప్రతినిధి )** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రముఖ టీఆర్ జి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈరోజు బాబుల్‌రెడ్డి నగర్ బొంద్రాయి వద్ద ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరానికి బాబుల్‌రెడ్డి నగర్ కాలనీ వాసులు అశేష సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా షుగర్ టెస్ట్‌లు, కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య సమస్యలను ఓపికగా విని, తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ శిబిరం ద్వారా వందలాది మంది ప్రజలు లబ్ధి పొందారని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇది ఎంతో ఉపయోగపడిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంపై టీ ఆర్ జి హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రజల నుండి మాకు అద్భుతమైన ఆదరణ లభించింది. ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజల్లో ఉన్న ఆసక్తిని ఇది తెలియజేస్తోంది. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించాం అని తెలిపారు. ఈ ఉచిత క్యాంపులో పరీక్షలు చేయించుకున్న వారికి టీఆర్ జి హాస్పిటల్‌లో ఇక్కడ చూపించుకున్న వాళ్లకి ఒక వారం పాటు కన్సల్టెన్సీ ఫీజు ఉచితంగా ఉంటుంది. అంతేకాకుండా, మందులపై 40 శాతం డిస్కౌంట్, ఇతర వైద్య పరీక్షలు (చెకప్‌లు) పై 60 శాతం డిస్కౌంట్ లభిస్తుందని హాస్పిటల్ యాజమాన్యం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్. గాదె సారీష్, కోడిచర్ల భీమ్ రెడ్డి, డైరెక్టర్లు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ తాజుద్దీన్ తో పాటు , టీ అర్ జి హాస్పిటల్ సిబ్బంది, నర్సులు మరియు ఇతర వాలంటీర్లు పాల్గొని శిబిరం విజయవంతానికి కృషి చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు టీఆర్జీ హాస్పిటల్ నిర్వాహకులు వెల్లడించారు

## మానసిక శారీరక వికలాంగుల మధ్య డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలు ఖమ్మంలో ఉద్యోగుల ఆధ్వర్యంలో బల్లెపల్లి సమీపంలో ఉన్న మదర్ మదర్ తెరిసా మానసిక శారీరక వికలాంగుల ఆశ్రమంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్బంగా మధ్యాహ్నం స్నాక్స్ డ్రింక్స్ ఇతర ఆహార పదార్థాలు అందజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుక పేదలు వికలాంగుల మధ్య జరిపించడం సంతోషంగా ఉందని జడ్ఎస్ జయపాల్ అన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ నిరంతరం పేదల అభివృద్ధి సంక్షేమం పైనే అయన దృష్టి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆయనకు ఉద్యోగ సంఘాల నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగానే ఆశ్రమ నిర్వాహకులు ఉప ముఖ్యమంత్రి భట్టి ని దీవించారు. ఇలాంటి వేడుకలు మున్ముందు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను కూడా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సగ్గుర్తి ప్రకాశరావు బూసా చంద్రశేఖర్ కోటపాటి రుక్మారావు కందుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శుభోదయం మైలార్ దేవ్ పల్లితో సమస్యల పరిష్కారం



**గండిపేట్,: సూర్యప్రతినిది** శుభోదయం మైలార్ దేవ్ పల్లి కార్యక్రమంతో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ తరపున పని చేయడం జరుగుతుందని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి శుభోదయం కార్యక్రమాన్ని శ్రీరామ్ నగర్, వెంకటేశ్వరా కాలనీ, నేతాజీ నగర్ బస్తీలల్లో పర్యటించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేక్షంగా పరిశీలించారు. కాలనీలలో ఎక్కడ చుసిన మురుగు నీరు నదిని తలపించే విధంగా రోడ్లమీద ప్రవహిస్తూ ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా మారిందన్నారు. అక్కడ ఉన్న మ్యానవల్స్ నుండే కాకుండా నివాసాల మధ్య నుండి కూడా మురుగు ప్రవహిస్తూ చాలా గోర పరిస్థితి నెలకొన్న విషయం, జనావాసాల మధ్యలోనే చెత్త చెదారం ఉండటం, అంటువ్యాధులు ప్రభలే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయన్నారు. ప్రజలు నడుస్తున్న మార్గన్నే విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ దగ్గర మూడు మాసాల క్రితం కరెంటు షాట్ తో ఒక వ్యక్తి మరణించడం జరిగిందన్నానేజ. అయినా కానీ ఎలక్ట్రికల్ సిబ్బందికి చీమకుట్టినట్టు కూడా లేదు ఎలక్ట్రికల్ సిబ్బంది యొక్క నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. ఒకవేళ కూలిపోయే స్థితిలో ఉన్న దిమ్మ కాస్త కూలిపోయి చిన్న పిల్లల మీద పడే స్థితిలో ఉన్నది,విద్యుత్ స్థంబాలు రోడ్ కి అడ్డుగా ఉన్నాయన్నారు దానితో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. కొన్ని ప్రాంతాలాల్లో సగానికి విరిగిన విద్యుత్ స్థంబాలు ఉన్నాయి దానితో ఎప్పుడు అవి మొత్తం విరిగి ప్రజల మీద పడుతాయో అని అక్కడ ప్రజలు తెలియజేసారు.స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు పార్టీ తరపున అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నోములరాము యాదవ్, యూత్ అధ్యక్షులు అక్కెంరాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, రాజేష్ యాదవ్, ఎడ్ల కాడి సూర్యం, మైసి రెడ్డి, జి రాజు, కొంపల్లి జగదీష్ నేత, వెంకటరమణ, చిరంజీవి, భూదేవి, అరుణ రెడ్డి, సరిత, శ్రీకాంత్, అనిల్, మహేష్, అశోక్ కుమార్, సందీప్ గుప్తా, సునీల్, రాజు, క్రాంతి, సింహాచలం, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి

**కాగజ్ నగర్ :** కుమురంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఏక పక్షంగా, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.49 ను తీసుకువచ్చిందని ఆరోపించారు. జీవో వల్ల జిల్లాలోని రైతులకు, గిరిజనులకు, గిరిజనేతరులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 4 లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటించడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి, ప్రజలు తిరగలేని పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లకు కనీసం మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అనుమతులు వచ్చే పరిస్థితి ఉండదని విమర్శించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయలేని పరిస్థితి వచ్చిందని, తాగునీటికి బోరింగ్లు వేయనీయకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇక టైగర్ కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అధికారులు పెట్రేగి పోయి ప్రజల మాన ప్రాణాలతో చెలగాటం ఆడటం జరుగుతుందని ఆరోపించారు. జీవో నంబర్ 49పై ఆదివాసీ సంఘాలు ఆందోళన చేస్తుంటే, కనీసం మాట మాత్రం కూడా గిరిజన ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట మాత్రం స్పందించక పోవడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీసి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రేపటి నుంచి బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయాల ఎదుట జీవో నం.49 ప్రతులను దహనం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు శివ, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, మండల అధ్యక్షులు పుల్ల అశోక్, మాజీ ఎంపీటీసీ గణపతి, తిరుపతి, గజ్జల లక్ష్మణ్, తిరుపతి గౌడ్, మహేష్, చిలుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**బెల్లంపల్లి :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు యూనియన్ మంచిర్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంటా చౌరస్తాలో సింగరేణి అన్వేషణ విభాగం ప్రహరీని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆటో యూనియన్‌కు కేటాయించాలని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు భోజన వసతి, మీటింగ్ హాల్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రస్తుతం ఉన్న ఆటో స్టాండ్ స్థలాన్ని కేటాయిస్తూ అనుమతినివ్వాలని కోరారు. పట్టణంలో ఉన్న పలు ఆటో స్టాండ్ స్థలాలు కబ్జాలకు గురయ్యాయని, భవిషత్తులో ఆ స్థలాలు మరింతగా కబ్జా కాకుండా కలెక్టర్ చొరవ చూపాలని పేర్కొన్నారు. 30 సంవత్సరాలుగా ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని వివరించారు. కబ్జాలను అడ్డుకోకపోతే తాము రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి బస్టాండ్ వెనుక ప్రస్తుత ఆటో స్టాండ్‌ను కొంతమంది కబ్జా చేయడానికి యత్నాలు చేస్తున్నా రని ఆరోపించారు. ఆ స్థలాన్ని ఆటో యూనియన్‌కు మంజూరు చేయాలని కోరారు.

## కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గం

**రాజేంద్రనగర్ :** కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గం అని రాజేంద్రనగర్ మండల్ న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి నీలిమ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పదకొండవ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ లోని కోర్టు వద్ద నిర్వహించారు. ఇందులో భాగంగా మ్మొత్తం 2,046 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ లో రాజీపడిన కేసులు 274,అడ్మిషన్ కేసులు 423,డంకన్ డ్రైవ్ కేసులు 957, సైబర్ క్రైమ్ కేసులు 118, ఇ-పెట్టి కేసులు 274 లను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 13వ అదనపు న్యాయమూర్తి నిష్క పాత్రుడు, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్, ఏపీపీ ప్రవీణ్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాసోజు యాదగిరి,కార్యదర్శి బందయ్య, లోక్‌అదాలత్ సభ్యులు వెంకట్ రెడ్డి, సుదర్శన్, సుధాకర్ రెడ్డి,సుజాత,వరప్రసాద్,శ్రీనివాసులు,ణ్ణనేశ్వర్ చారి, తలారి శ్రీ శైలం, కోర్టు సిబ్బంది రవీందర్, వెంకటరంగారెడ్డి, మంజుల, సునిత, నరేష్ గౌడ్, సంబంధిత ఠాణాల ఎస్ హెచ్ ఓ లు,సిబ్బంది,బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం యోగ సాధనతో ఆరోగ్యవంతంగా జీవనం

**శ్రీవివేకానంద యోగా సమితి అధ్యక్షుడు ఓరుగంటి భద్రయ్య గుప్తా గురూజీ.**

**11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో భారీ ఏర్పాట్లు**

**గండిపేట్: (సూర్య ప్రతినిధి)** నిత్యం యోగ సాధనతో మనిషి జీవన ప్రమాణాలు ఆరోగ్యవంతంగా మారుతాయని శ్రీ వివేకానంద యోగా సమితి అధ్యక్షుడు ఓరుగంటి భద్రయ్య గుప్తా గురూజీ అన్నారు. ప్రతి నిత్యం శుభోదయ వేళ యోగ సాధన చేయడం ప్రతి ఒక్కరి దిన చర్యలో భాగం కావాలని ఆయన సూచించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ తేదీన కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులోభాగంగా ఆదివారం రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, మైలాదేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ టీ.ప్రేమ్ దాస్ గౌడ్, యోగాసన విశారద వ్యవస్థాపక అధ్యక్షుడు బీరెల్లి చంద్రారెడ్డి, వైఫ్ అండ్ బిజినెస్ కోచ్, ట్రైనర్, మోటివేషన ల్ స్పీకర్ మహేంద్రగురు తదితరులను సమితి ప్రతినిధులతో కలసి వెళ్లి ఆహ్వానించారు. అనంతరం దుర్గా నగర్, మార్కండేయనగర్, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రతి రోజు యోగా చెద్దాం... ఆరోగ్య వంతంగా జీవిద్దాం... అన్న నినాదాలు చేస్తూ వివేకానంద యోగ సమతి ఆధ్వర్యంలో యోగా చైతన్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాంత ప్రజలను 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో యోగా సమితి కార్యదర్శి బి.కృష్ణయ్య, ప్రతినిధులు వెంట కటేశ్వర్రావు గురూజీ, రవీంచర్, ఎల్లప్ప , సురేష్, డా. ప్రకాష్, బాస మ హేందర్, శంకర్ కుమార్, పద్మజ , సునీత, సరిత, బాబుయాదవ్, వీరేందర్ యాదవ్, విజయ లక్ష్మి, భారతి, మంగమ్మ, సితా రాంపాండు,బాబు రామ్, నర్సింహా, ఆజాద్, మాలతి, మనోజ్ రానా, లాల్ జీ మహేష్, పాండురంగం. మనోష్, వెంకటేష్ యాద వ్ , రమేష్ గుప్త, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులు ఒక వర్గం వారిని టార్గెట్ చేయడం తగదు





**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** పోలీసులు ఒక వర్గం వారిని టార్గెట్ చేసి కేసులు పెట్టడం సమంజసం కాదని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ము కాస్తుందని ఆరోపించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లక్ష్మిగూడ ప్రాంతంలో బక్రీద్ పండుగ మరుసటి రోజు అయిన ఆదివారం రాత్రి కళేబరాలను తరలిస్తున్న డీసీఎం లారీలను అడ్డుకున్న సంఘటన, అత్తాపూర్ డివిజన్లోని పాండురంగ నగర్ లో ఆవులను వధించడానికి తీసుకెళ్తుండగా అడ్డుకున్న హిందూ యువకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, గోరక్ష, ఆర్ఎస్ఎస్, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డిసిపి ఆఫీసు ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకులపై అక్రమ కేసులను రద్దు చేయాలని పెట్టిన కేసులలో సెక్షన్లను మార్చాలని, ఇకపై అక్రమ అరెస్టులను ఆపాలన్నారు. అలాగే అక్రమంగా చట్ట వ్యతిరేకంగా జంతు కళేబరాలను తరలిస్తున్న డీసీఎం యజమానులపై, వాటి నిర్వాహకులపైన కేసులు పెట్టాలన్నారు. పోలీసులు ఒక వర్గంపై మాత్రమే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఈ విషయాలపై హిందూ సంఘాలు భారతీయ జనతా పార్టీ నాయకులు డిసిపి అందుబాటులో లేకపోవడంతో ఏసీబీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రమేష్ బాబు, గోరక్ష ప్రముక్ విశాల్ ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్ యాదవ్, ముకేష్ యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్ యాదవ్, డీజే శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ తోగల శ్రీనివాస్ రెడ్డి, వై శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కొమురయ్య, భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి నవీన్ యాదవ్, జోగి రవి, డి లక్ష్మీనారాయణ, ఎస్ విజయ్ కుమార్, అడికే రాజు,ఎన్ జగన్, ఏ.జనార్ధన్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎస్ వినయ్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేష్, ఎం నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


# ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో ఉండాలి

**రాజేంద్రనగర్ :** ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని గాంధీభవన్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మనం రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసినట్లే అన్నారు. రాష్ట్రంలో 10 ఏళ్లపాటు ప్రజల పక్షాన ఉండి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేసిన నాయకుడు బట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆశీర్వాదాలతో బట్టి విక్రమార్క అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో వందేళ్లు సుఖంగా ఉండి మరెన్నో పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ నాయక్, ఆంజనేయులు, గోపాల్, పవన్, ఇంద్రారెడ్డి, రాజేష్, బొబ్బిలి శేఖర్, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.



# బిజినెస్

## ఇంటెల్‌లో ఉద్యోగ కోతలు!




**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ టెక్ కంపెనీ ఇంటెల్ కొందరు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోంది. మార్చిలో కంపెనీ సీఈఓగా లిప్–బు టాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల తొలగింపుపై దృష్టిపెట్టారు. జులై మధ్య నుంచి మొదలుకానున్న ఈ ప్రక్రియ నెలాఖరు నాటికి పూర్తవుతుందని సమాచారం. కంపెనీ తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించి, పోటీతత్వాన్ని పెంచే వ్యూహాత్మక ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లేఆఫ్ విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఎంత మందిని తొలగించవచ్చు, ఏ ప్రాంతాల్లో కోతలు జరుగుతాయనే వివరాలు వెల్లడించలేదు. పీసీ, ల్యాప్‌ట్యాప్ విక్రయాలు తగ్గడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఎన్విడియా, ఏఎమ్‌డీల నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంటెల్ ఈ నిర్ణయం తీసుకుంది.

## ఐపీఓకు ముందు రూ.260 కోట్లు సమీకరించిన హీరో ఫిన్‌కార్ప్




**ఇంటర్నెట్ డెస్క్:** ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ లిస్టింగ్‌ను వేగవతం చేస్తోంది. అందులో భాగంగానే ఐపీఓకు ముందు రూ.260 కోట్లను సమీకరించింది. దీంతో పబ్లిక్ ఇష్యూలో విక్రయించాల్సిన తాజా షేర్ల మొత్తం రూ.2,100 కోట్ల నుంచి రూ.1,840 కోట్లకు తగ్గింది. మొత్తం ఐపీఓ పరిమాణం రూ.3,668 కోట్ల నుంచి రూ.3,408 కోట్లకు తగ్గింది. ఇందులో రూ.1,568 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి పెట్టారు. జూన్ 5న కంపెనీ నిర్వహించిన ప్రీ- ఐపీఓ రౌండ్‌లో 12 మంది పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో షేరు రూ.1,400 చొప్పున 18.57 లక్షల వాటాలను వారికి కేటాయించింది. దీని ద్వారా రూ.260 కోట్లు సమీకరించింది. హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ప్రణాళికను గతేడాది ప్రకటించింది. నాటి నుంచి వీటి పబ్లిక్ ఇష్యూ రాక కోసం మదుపర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మేలో సెబీ నుంచి ఐపీఓకు అనుమతి లభించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్ని భవిష్యత్తు రుణ కార్యకలాపాల కోసం కంపెనీ మూలధనాన్ని పెంచేందుకు ఉపయోగించనుంది. హీరో ఫిన్‌కార్ప్ నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు రుణాలు అందిస్తోంది. 2024 మార్చి నాటికి కంపెనీ ఆస్తులు రూ.51,821 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీకి 1.18 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు.

# పెరుగుతున్న అపార్ట్‌మెంట్ లోడింగ్



నివాస విభాగాన్ని కరోనా కంటే ముందు, ఆ తర్వాత అని విభజించే పరిస్థితులు వచ్చాయి. కోవిడ్ కంటే ముందు వరకూ అపార్ట్‌మెంట్ విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అంటే ఫ్లాట్ ఏరియాలో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం ఎంత ఉందని చూసుకునేవారు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. ఫ్లాట్‌లో నివాసితుడు వినియోగించే స్థలం కంటే క్లబ్‌హౌస్, పార్క్, గార్డెన్, లాబీ వంటి వసతులకు ఎంత స్థలం కేటాయిస్తున్నారనే దానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ లైఫ్ స్టయిల్‌ను కోరుకునే యువ జనరేషన్ పెరుగుతుండటంతో అపార్ట్‌మెంట్‌లో కార్పెట్ ఏరియా క్రమంగా తగ్గుతోందని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లో ఫ్లాట్ల స్థలంతో పాటు లిఫ్ట్, మెట్లు, క్లబ్‌హౌస్, పార్క్ ఇతరత్రా వసతుల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలిపితే దాన్ని సూపర్ బిల్టప్ ఏరియాగా పేర్కొంటారు. ఇక, ఫ్లాట్‌లో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం(గోడ నుంచి గోడ వరకూ ఉండే స్పేస్)ను కార్పెట్ ఏరియాగా పేర్కొంటారు. కరోనా మహమ్మారి కంటే ముందు వరకూ గృహ కొనుగోలుదారులు కార్పెట్ ఏరియాకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా.. కోవిడ్ తర్వాత నుంచి కార్పెట్ కంటే అపార్ట్‌మెంట్‌లోని వసతులకు(లోడింగ్) ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1) నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ లోడింగ్ 40 శాతానికి చేరుకుంది. 2019లో ఇది 31 శాతంగా ఉంది. నివాస సముదాయాలలో అధునిక వసతులు, సౌకర్యాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ల లోడింగ్(వసతులు)పెరుగుతోంది. విలాసవంతమైన జీవనశైలి కారణంగా గృహ కొనుగోలుదారులు అధిక వసతులు, సౌకర్యాలను కోరుతున్నారు.

### వసతులకు ప్రాధాన్యం

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్లలోని మొత్తం స్థలంలో 60 శాతం నివాసయోగ్యమైన స్థలం కాగా మిగిలిన 40 శాతం సాధారణ ప్రాంతం. లిఫ్ట్, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్, వసతులు, టెరస్ వంటి కామన్ ఏరియాలు. కరోనా కంటే ముందు వరకూ 30 శాతం కంటే తక్కువ లోడింగ్ సాధారణంగా భావించేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి విలాసవంతమైన జీవనశైలి అలవాటైపోయింది. ప్రాజెక్ట్ చిన్నదైనా, పెద్దదైనా ఆధునిక వసతులు ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లలో నివాసయోగ్యమైన స్థలం కార్పెట్ ఏరియా తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు ప్రాథమిక జీవనశైలి సౌకర్యాలతో సంతృప్తి చెందడం లేదు. ఫిట్‌నెస్ కేంద్రాలు, క్లబ్ హౌస్, పార్క్, గార్డెన్, గ్రాండ్ లాబీలు ఉండాలని కోరుకుంటున్నారు.

### రీసేల్ విలువ పెరుగుదల..

లోడింగ్ పెరిగితే కమ్యూనిటీ నివాస యోగ్యత, రీసేల్ విలువలను కూడా పెరుగుతుంది. అయితే గృహ కొనుగోలుదారులు తమ అపార్ట్‌మెంట్లలో వాస్తవంగా ఉపయోగించే స్థలాన్ని కోల్పోతారు. ప్రతి ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్‌లోని మొత్తం స్థలంలో గృహ కొనుగోలుదారులు వాస్తవంగా ఉపయోగించే స్థలం, సౌకర్యాల కోసం కస్టమర్లు ఎంత చెల్లిస్తున్నారో స్పష్టంగా పేర్కొనేలా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) నిబంధనలు రూపొందించాలి. దీంతో కస్టమర్లు చెల్లించే సొమ్ములో దేనికెంత వ్యయం అవుతుందో స్పష్టత ఉంటుంది.

### లోడింగ్ శాతాన్ని ఎలా లెక్కిస్తారంటే..

సూపర్ బిల్టప్ ఏరియా నుంచి కార్పెట్ ఏరియాను తీసి వేసి, కార్పెట్ ఏరియాతో భాగించాలి. వచ్చిన ఫలితాన్ని వందతో గుణిస్తే వచ్చేదే లోడింగ్ శాతం. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో మీరు 1,500 చ.అ. అపార్ట్‌మెంట్ కొంటున్నారని అనుకుందాం. ఇందులో ఫ్లాట్‌లో కస్టమర్ వినియోగించే స్థలం 750 చ.అ.లే ఉంటుంది. మిగిలిన స్థలం లిఫ్టు, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్ వంటి కామన్ ఏరియాలు ఉంటాయి. అంటే ఫ్లాట్ ఖరీదులో కస్టమర్ వాస్తవంగా వినియోగించే కార్పెట్ ఏరియాతో పాటు కామన్ ఏరియా కూడా కలిపే ఉంటుందన్నమాట.

### నగరంలో లోడింగ్ 38 శాతం..

హైదరాబాద్‌లో లోడింగ్(వసతులు) శాతం 2019లో 30 శాతంగా ఉండగా.. 2022 నాటికి 33కు, ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 38 శాతానికి పెరిగింది. 2025 క్యూ1 నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అత్యధికంగా 43 శాతం లోడింగ్‌తో ముంబై ప్రథమ స్థానంలో నిలిచింది. 2019లోనూ ఈ ఆర్థిక నగరంలో అత్యధిక లోడింగ్ 33 శాతంతో టాప్‌లో నిలిచింది. అత్యల్పంగా 36 శాతం లోడింగ్‌తో చెన్నై చివరి స్థానంలో నిలిచింది. 2019లో ఇక్కడ లోడింగ్ 30 శాతంగా ఉంది. ఏటేటా బెంగళూరులో అపార్ట్‌మెంట్ లోడింగ్ క్రమంగా పెరుగుతోంది. 2019లో ఇక్కడ 30 శాతం లోడింగ్ ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 41 శాతానికి పెరిగింది. 2022లో ఇది 35 శాతంగా ఉంది. గత ఏడేళ్లలో బెంగళూరులో సగటు లోడింగ్ అత్యధిక శాతం వృద్ధిని నమోదు చేస్తూ ఉంది. ఎన్‌సీఆర్ లో 2019లో లోడింగ్ శాతం 31 శాతం నుంచి 2025 క్యూ1 నాటికి 41 శాతానికి చేరింది. పుణేలో 32 శాతం నుంచి 40కు, కోల్‌కతాలో 30 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది.

## ఎంజీ మోటార్ ఆఫర్.. ఈవీపై రూ.4.4 లక్షలు డిస్కౌంట్!



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్ తన ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. భారత్ మార్కెట్లోకి అడుగు పెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. తన తొలి ఎలక్ట్రిక్ వాహనం జెడ్ఎస్ ఈవీపై ఏకంగా రూ.4 లక్షల తగ్గింపు ప్రకటించింది. పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. జెడ్ఎస్ ఎస్‌యూవీ ఎగ్జిక్యూటివ్ వేరియంట్‌పై రూ.13వేలు రాయితీ అందిస్తోంది. దీంతో ఈ కారు ధర రూ.16.88 లక్షల నుంచి రూ.16.75 లక్షలకు తగ్గింది. ఎక్సైట్ ప్రో వేరియంట్‌పై రూ.48వేలు డిస్కౌంట్ అందిస్తోంది. ఈ కారు ధర రూ.18.97 లక్షలు (ఎక్స్-షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.18.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. రూ.23.64 లక్షలున్న ఎక్స్‌క్లూజివ్ ప్లస్ వేరియంట్‌ను రూ.19.49 లక్షలకే లభిస్తుంది. టాప్–ఎండ్ ఎసెన్స్ వేరియంట్‌పై అత్యధిక డిస్కౌంట్ అందిస్తోంది. ఈవీ ధర రూ.24.93 లక్షలు (ఎక్స్- షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.20.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. అంటే ఏకంగా రూ.4.44 లక్షలు తగ్గింపు పొందొచ్చు. ఎంజీ మోటార్.. భారత మార్కెట్లోకి తీసుకొచ్చిన తొలి విద్యుత్ వాహనమే ఎంజీ జెడ్ఎస్. టాటా కర్వ్.ఈవీ, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, మహీంద్రా బీఈ6 వంటి మోడళ్లకు పోటీగా తీసుకొచ్చింది. 50.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో తీసుకొచ్చిన ఈ కారు సింగిల్ ఛార్జ్‌తో 461 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు.

# స్పోర్ట్స్

# ఆస్ట్రేలియా డబుల్ స్ట్రోక్.. టీమిండియాకు ఆరో ఓటమి!



యూరప్ గడ్డపై జరుగుతున్న హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు ఆరో ఓటమి ఎదురైంది. ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో పరాజయంతో కుమిలిపోతున్న టీమిండియా.. ఆస్ట్రేలియా చేతిలో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. గత పోరులో ఆఖర్లో గోల్స్ సమర్పించుకున్న భారత్.. ఈసారి ప్రత్యర్థిని నిలువరించలేక మళ్లీ విజయం వాకిట బొక్కబోర్లాపడింది. శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హర్‌ప్రీత్ సింగ్ సేన 2–3తో వెనకబడింది. గత మ్యాచ్‌లో మాదిరిగానే భారత ఆటగాళ్లు తొలి అర్ధ భాగంలోనే గోల్ సాధించారు. డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ అందించాడు. కానీ, ఆ తర్వాత ఆసీస్ ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ 5 వ నిమిషంలో గోల్స్ చేయగా భారత్ వెనకబడింది. అయితే.. దిల్‌ప్రీత్ సింగ్ 36వ నిమిషంలో గోల్ చేయగా టీమిండియా 2–2తో స్కోర్ సమం చేసింది. దాంతో 'హమ్మయ్య మ్యాచ్‌ను కాపాడుకుంటాం' అని హర్మన్‌ప్రీత్ సేన ధీమాగా ఉన్న వేళ.. భారత డిఫెండర్లను ఏమారుస్తూ కూపర్ బర్న్స్(36 నిమిషం) గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 27వ నిమిషంలో టీమిండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కానీ.. వాటిని హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడుతున్న మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తీవ్రంగా నిరాశపరిచాడు. మరో 10 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఆసీస్ ఆటగాళ్లు రెండు పెనాల్టీ కార్నర్లు సాధించారు. అయితే.. గోల్ కీపర్ పాఠక్ వాటిని సమర్ధంగా అడ్డుకోవడంతో ఒక్క పాయింట్ తేడాతో భారత జట్టు పరాజయం పాలైంది. వరుసగా ఆరు ఓటములతో డీలాపడిన టీమిండి తదుపరి మ్యాచ్‌లో జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.

## కెప్టెన్‌గా చిరస్మరణీయ విజయాలు అందించా.. కానీ, నా జుట్టును కోల్పోయా..!



శ్రీలంక మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ త్వరలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్న విషయం తెలిసిందే. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు అతడికి చివరి మ్యాచ్ కానుంది. రిటైర్మెంట్ వార్తను ఇప్పటికే ప్రకటించిన మాథ్యూస్ .. తన కెరియర్‌లోని పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కెప్టెన్సీ సమయంలోనే తన జుట్టు ఎక్కువగా ఊడిపోయిందని చెప్పాడీ ఆల్‌రౌండర్. 'కెప్టెన్సీ చేపట్టిన తర్వాత నా జుట్టు చాలా పోయింది. నేను ఒక్కడినే కాదు లంకకు సారథ్యం వహించిన పలువురు ఆటగాళ్లకు కూడా పెద్దగా జుట్టు లేదు. ఎందుకంటే.. దేశానికి ప్రాతినిధ్యం వహించడం వేరు. జట్టును నడిపించడం వేరు. ప్రతిసారి అదనపు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిఒక్కరు మనల్నే గమనిస్తారు. టీమ్ గెలిచినా, ఓడినా మనం ఏం చెబుతామో వినాలని కోట్లాది మంది ఎదురుచూస్తారు. అందుకు.. అప్పుడప్పుడు ఒత్తిడిగా అనిపిస్తుంది. అయినా.. నేను ఆ సవాళ్లతో కూడిన ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించాను. నాకు అవకాశం లభించింది. జట్టును మరొక స్థాయికి తీసుకువెళ్లాలి' అనే లక్ష్యంతో పని చేశాను అని మాథ్యూస్ వెల్లడించాడు. బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా లంక జట్టులోకి వచ్చిన మాథ్యూస్ 2013లో టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 25 ఏళ్లకు పగ్గాలు అందుకున్న అతడు పిన్నవయస్కుడైన సారథిగా రికార్డు నెలకొల్పాడు. మాథ్యూస్ నేతృత్వంలోని లంక విదేశీ పర్యటనల్లో అద్భుతంగా రాణించింది. 2014లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ విజేతగా నిలిచింది. అనంతరం వన్డే, టీ20 సారథిగానూ సేవలందించాడు మాథ్యూస్. అయితే.. 2017 జింబాబ్వే చేతిలో వన్డే సిరీస్ ఓటమితో అతడు మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా వైదొలిగాడు.

## అదే నాలో స్ఫూర్తి నింపింది.. ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసింది: మార్‌క్రమ్




**ఇంటర్నెట్ డెస్క్:** డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్‌క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్‌క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగన మార్‌క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. "డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఔట్ అయిన తర్వాత నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూడదని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగాను" "ఇక సెంచరీ సాధించిన తర్వాత నేను చాలా భావేద్వేగానికి గురయ్యాను. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు కన్నీళ్లు కూడా వచ్చాయి. ఇక చివరి రోజు జట్టు విజయానికి 69 పరుగుల దూరంలో ఉన్నప్పుడు.. అంతకుముందు రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాను. కానీ నాకు విశ్రాంతి దొరకలేదు. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు. అయితే.. చివరి రోజు మేం విజయం సాధించాం" అని మార్‌క్రమ్ భావోద్వేగానికి

# ‘దేవర 2’ కోసం వెయిట్ చేస్తున్న..
# కొరటాల శివకి ఎన్టీఆర్ స్పెషల్ బర్త్‌డే విషెస్



అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం దేవర. సముద్రంపై ఆధారపడిన ప్రజల జీవితాలపై వచ్చిన ఈ చిత్రం గతేడాది విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది. ఇదిలావుంటే నేడు ఈ చిత్ర దర్శకుడు కొరటాల శివ పుట్టినరోజు కావడంతో ఆయనకు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా ఎన్టీఆర్ కూడా శివకి బర్త్‌డే విషెస్ తెలిపాడు. పుట్టినరోజు శుభాకాంక్షలు శివ!. మాట్లాడకుండానే, మౌనంగానే తన బలాన్ని చూపించే సినిమా మేకర్ మీరు. మీరు మరెన్నో స్ఫూర్తిదాయకమైన కథలను తీయాలని, మాకు గుర్తుండిపోయే మరెన్నో మంచి క్షణాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను. దేవర 2తో మళ్ళీ మీతో కలిసి ప్రయాణం చేయడానికి వేచి చూడలేకపోతున్నాను అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు.




# అలా అయితే తొలి సీన్‌లో మిమ్మల్ని వేసేస్తా

టాలీవుడ్ నుంచి త్వరలో రాబోతున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ ‘కన్నప్ప’. ఇదివరకే ప్రమోషన్స్ చేస్తున్నారు. శనివారం సాయంత్రం కొచ్చిలో.. నటుడు మోహన్ లాల్ చేతుల మీదగా ట్రైలర్ రిలీజ్ చేశారు. దీనికి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. అయితే ఇదే ఈవెంట్‌లో మోహన్ లాల్–మోహన్ బాబు మధ్య ఫన్నీ సంభాషణ జరిగింది. అలానే మోహన్ బాబు ఓ పెద్ద కోరికని బయటపెట్టారు. ఇప్పుడు ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ‘కన్నప్ప’లో మలయాళ సూపర్‌స్టార్ మోహన్ లాల్ అతిథి పాత్ర పోషించారు. ఈ క్రమంలోనే తాజాగా కొచ్చిలో ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనే మోహన్ లాల్ మాట్లాడుతుండగా.. మీ సినిమాలో తాను విలన్ చేస్తానని మోహన్ బాబుతో అన్నాడు. బదులుగా మీ మూవీలో తాను విలన్‌గా మోహన్ బాబు చెప్పుకొచ్చాడు. అలా అయితే తొలి సీన్‌లో మిమ్మల్ని కాల్చి పడేస్తానని మోహన్ లాల్ అనేసరికి స్టేజీపై ఉన్నవాళ్లంతా నవ్వుకున్నారు. మరోవైపు ఇదే వేడుకలో మాట్లాడిన మోహన్ బాబు.. కేరళలో ‘తుడరుమ్’ చిత్రాన్ని ‘కన్నప్ప’ అధిగమించాలని తాను కోరుకుంటున్నట్లు మోహన్ బాబు తన మనసులో మాట బయటపెట్టారు. ఆ మూవీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ ‘కన్నప్ప’కు రావాలని తాను అనుకుంటున్నట్లు మోహన్ బాబు చెప్పుకొచ్చారు. ఏప్రిల్ చివర్లో రిలీజైన మోహన్ లాల్ ‘తుడరుమ్’.. మలయాళంలో ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. కేవలం కేరళలోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. మరి మోహన్ బాబు చాలా పెద్దగా ఆశపడుతున్నారు. చూద్దాం మరి ఆయన కోరిక నెరవేరుతుందో లేదో?

# ఒక్క సినిమాకు రూ.10 కోట్లు..
# ఇండస్ట్రీలో తోపు మ్యూజిక్ డైరెక్టర్

దక్షిణాది చిత్రపరిశ్రమలో అతడు తోపు మ్యూజిక్ డైరెక్టర్. ఇండస్ట్రీలోనే ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో పలు చిత్రాలకు బ్లాక్ బస్టర్ హిట్ సాంగ్స్ అందించారు. అతడు అందించిన పాటలు, బీజీఎం యూట్యూబ్ లో దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం తీసుకునే మ్యూజిక్ డైరెక్టర్ అతడు. ఈమధ్య కాలంలో అతడి పేరు నెట్టింట తెగ మారుమోగుతుంది. ఇంతకీ అతడు ఎవరో తెలుసా.. ? జైలర్, పెట్ట, మాస్టర్, విక్రమ్ వంటి బ్లాక్ బస్టర్ హిట్ తమిళ సినిమాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన టాప్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్. ఇటీవల %హ=ఎ% సీఈవో కావ్య మారన్ తో పెళ్లంటూ వార్తలలో ఆయన పేరు తెగ చక్కర్లు కొడుతుంది. అనిరుధ్ రవిచంద్రన్.. మ్యూజిక్ పరంగానే కాదు.. ఎక్కువగా ప్రేమకథలతో వార్తలలో నిలుస్తుంటారు. నివేదికల ప్రకారం..2023లో షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమా కోసం రూ.10 కోట్లు పారితోషికం తీసుకున్నాడు. రెహమాన్ రెమ్యునరేషన్ రూ.8 కోట్లు ఉండగా..ఇప్పుడు టాప్ స్థానంలో అనిరుధ్ నిలిచాడు. ఒక్కో సినిమాకు రూ.10 నుంచి 12 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటాడు అనిరుధ్. అలాగే నివేదికల ప్రకారం అతడి ఆస్తులు రూ.50 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇదిలా ఉంటే అనిరుధ్ వయసు కేవలం 34 సంవత్సరాలు మాత్రమే. గత నాలుగు రోజులుగా అనిరుధ్ పేరు నెట్టింట మారుమోగుతుంది. కళానిధి మారన్ కూతురు కావ్య మారన్ తో అనిరుధ్ ప్రేమలో ఉన్నారని.. త్వరలోనే వీరిద్దరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ ప్రచారం నడుస్తుంది. అయితే తాజాగా ఈ రూమర్స్ పై స్పందించిన అనిరుధ్.. తన గురించి రూమర్స్ ప్రచారం చేయడం ఆపాలంటూ ట్వీట్ చేశారు. ఇక ఈ వార్తలపై కావ్య మారన్ ఇంకా స్పందించలేదు.



# అవార్డు వేడుకలకు మిస్ అవ్వొద్దు
# - చిత్ర పరిశ్రమకు దిల్ రాజు సూచన



హైదరాబాద్: ప్రభుత్వాలు నిర్వహించే సినిమా వేడుకకు తప్పనిసరిగా హాజరుకావాలని చిత్ర పరిశ్రమకు ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు సూచించారు. ‘తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్’ ప్రదానోత్సవం శనివారం జరిగిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పేందుకు దిల్ రాజు తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ‘తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక నిన్న గ్రాండ్‌గా జరిగింది. ఆ విషయంలో ఆనందంగా ఉంది. దాని కోసం ఆరు నెలలుగా వర్క్ చేశాం. ఈ పురస్కారాలకు సంబంధించి కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. ముందుగా 2024 చిత్రాలకే అవార్డులు ఇవ్వాలన్నది ప్లాన్. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన ఏడాది నుంచీ ఇస్తే బాగుంటుందని పలువురు సూచించారు. ఆ మేరకు ఓ కమిటీ ఏర్పాటైంది. 2014 నుంచి 2023 వరకూ ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం కష్టమైన పని. వేడుకలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. సీఎం ఒక గంట కేటాయించారు. కానీ, ప్రోగ్రామ్ ప్లానింగ్ నాలుగున్నర గంటలుగా ఉంది. అందుకే రేవంత్ గారు వేడుకకు వచ్చాక.. పరిస్థితి వివరించి, ఇంకా ఎక్కువ సమయం ఉండాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశా. ‘ఎంతసేపు ఉండాలి?’ అని అడిగారు. పూర్తయ్యే వరకూ ఉంటే చాలా హ్యాపీ సర్ అని చెప్పా. అలా 2:15 గంటల పాటు అక్కడ ఉన్నారు. సీఎం చేతుల మీదుగా అవార్డులను అందుకున్న వారంతా చాలా ఆనందంగా ఉన్నారు. ఈ పురస్కారాల వేడుక విషయంలో మాకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు” “త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి అవార్డులు వస్తున్నాయంటే.. చాలా జాగ్రత్తగా వాటిని స్వీకరించాలి. ఎక్కడున్నా, షూటింగ్‌తో బిజీగా ఉన్నా రావాలి. ప్రభుత్వంతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరిదీ. ఇకపై ప్రభుత్వం తరపున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు.. మీ డైరీల్లో నోట్ చేసుకుని, మీకు వచ్చిన అవార్డు తప్పకుండా స్వీకరించండి. చిత్ర పరిశ్రమకు ఇది నా విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని అనుకుంటున్నా” అని పేర్కొన్నారు. వేడుకకు హాజరై, విజయవంతం చేసిన వారందరికీ ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ ధన్యవాదాలు తెలిపారు.



# మగవాడి ప్రేమకి సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు..
# ఆడదాని ప్రేమకి ఏమున్నాయి?

కొందరు దర్శకులు ఒకే మూసలో సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడుతున్నారు. కాని కొందరు మాత్రం ఫీల్ గుడ్ మూవీస్‌తో ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రేమ కథల్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తూ ఎమోషన్స్‌తో కూడుకున్న సన్నివేశాలతో ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తున్నారు. తాజాగా ఫణీంద్ర నర్సెట్టి ఓ అందమైన, భావోద్వేగంతో కూడిన ప్రేమ కథను ప్రేక్షకులకి అందించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఈ దర్శకుడు మధురం షార్ట్ ఫిల్మ్, మను చిత్రాలతో రైటర్‌గా మంచి పేరు తెచ్చుకున్నాడు. చాలా గ్యాప్ తరువాత ‘ 8 వసంతాలు ’ అనే సినిమాను తీశారు. ఈ చిత్రం జూన్ 20న రాబోతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే వదిలిన టీజర్, పోస్టర్, పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా ట్రైలర్ విడుదల కాగా, చూస్తుంటే ఇది.. అమ్మాయి ప్రేమ కథలో నుండి తీసిన సినిమాగా అర్థమవుతుంది. అమ్మాయి వేదన, ఆమె బాధ అన్నింటిని చిత్రంలో చక్కగా చూపించనున్నట్టు తెలుస్తుంది. ట్రైలర్ మాత్రం ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంది. డైలాగ్స్ మాత్రం నేరుగా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి. ‘చూడమ్మా ఆడవాళ్లు నిప్పు పట్టకూడదు.. అంత్యక్రియలకు వాళ్లు పనికి రారు’..‘ఆడవాళ్లు పనికి రారా పేగు పంచి ప్రాణం పోయగలిగిన మేము.. చితి ముట్టించి మోక్షం ఇప్పించలేమా?’.. ‘నా ఆనందాన్ని, మిమ్మల్ని సొంతం చేసుకోవాలనే ఆలోచనలో కాకుండా మీరు ఎదురుగా ఉన్నప్పటి క్షణాల్ని ఆస్వాధించడంలో వెతుక్కున్నా’.. ‘ప్రేమ.. జీవితంలో ఒక దశ మాత్రమే.. అదే దిశ కాదు’..‘మగాడి ప్రేమకి సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్య నగరాలున్నాయి.. ఆడదాని ప్రేమకేమున్నాయి.. మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్పా’.. అనే డైలాగ్స్ సినిమాలోని డెప్త్ ఎలా ఉందో తెలియజేస్తుంది. మార్షల్ ఆర్ట్స్ కాన్సెప్ట్, న్యూ ఏజ్ రొమాంటిక్ డ్రామా చిత్రంలో రవితేజ దుగ్గిరాల , హను రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించారు. హృద్యమైన పదాలతో సినిమా ఎలా ఉండబోతుందనే విషయాన్ని ట్రైలర్ ద్వారా చెప్పకనే చెప్పినట్టు అర్థమవుతోంది.

# హీరోయిన్ నివేదాను సడన్‌గా ఇలా చూసేసరికి

ఇండస్ట్రీలో అవకాశాలు దక్కించుకోవాలంటే హీరోయిన్లు.. టాలెంట్‌తో పాటు ఫిజిక్ కూడా మెంటైన్ చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు బ్యూటీస్ మాత్రం గ్లామర్‌ని నమ్ముకోకుండా యాక్టింగ్‌తో అలరిస్తూ ఉంటారు. నటనకు స్కోప్ ఉండే మూవీస్ చేస్తుంటారు. అలాంటి వాళ్లలో నివేదా థామస్ ఒకరు. తాజాగా గద్దర్ అవార్డుల్లో కనిపించిన ఈమె.. అందరికీ ఓ రకంగా షాకిచ్చింది. ఎందుకంటే చాలా మారిపోయింది. కేరళకు చెందిన నివేదా థామస్.. కుటుంబంతో కలిసి చెన్నైలో ఉంటుంది. బాలనటిగానే పలు సినిమాలు చేసిన నివేదా.. 2016లో వచ్చిన నాని ‘జెంటిల్‌మేన్’ మూవీత తెలుగులోకి హీరోయిన్‌గా పరిచయమైంది. అనంతరం నిన్ను కోరి, జై లవకుశ, 118, బ్రోచెవారెవరురా, వి, వకీల్ సాబ్ తదితర చిత్రాల్లో నటించింది. చివరగా ‘35: ఇది చిన్న కథ కాదు’లో ప్రధాన పాత్ర పోషించింది. ఈ మూవీకే ఉత్తమ నటిగా ఈమెని గద్దర్ అవార్డ్ వరించింది. తాజాగా శనివారం రాత్రి హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా.. నివేదా థామస్ కూడా హాజరైంది. కానీ పూర్తిగా చబ్బీగా కనిపించి అందరికీ షాకిచ్చింది. ఈమెని చూసి ఏంటి నివేదా ఇలా మారిపోయింది అని మాట్లాడుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతానికైతే నివేదా చేతిలో కొత్త సినిమాలేం లేవు. మరి నివేదా ఇంతలా మారిపోవడానికి వేరే ఏదైనా కారణముందా? అనేది తెలియాల్సి ఉంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.